

ఇంటి పంట..
భలే రుచులంట!
» మిద్దెలపై సాగు.. దిగుబడులు బాగు
» సేంద్రియ పద్ధతిలో సత్ఫలితాలు
» ఆదర్శంగా నిలుస్తున్న తిరుమలనగర్ కాలనీ వాసులు
-8వ పేజీలో



విశాఖ టు కాకినాడ వయా చోడవరం

దర్జాగా రేషన్ బియ్యం అక్రమ రవాణా

» ఎండీయూ వాహనం వద్దే కొనుగోళ్లు
» కిలోకు రూ.12 నుంచి రూ.15 వరకూ చెల్లింపు
» డిపోల్లో వేలిముద్ర వేసి డబ్బులు తీసుకుంటున్న మరికొందరు
» వీధుల్లోకి వచ్చే చిరు వ్యాపారులకు అమ్ముకుంటున్న ఇంకొందరు...
» గుట్టుగా సరకు ఆనందపురం, విజయనగరం, చోడవరం ప్రాంతాల్లో గల మిల్లులకు తరలింపు
» అక్కడ నుంచి కాకినాడ పోర్టుకు...
» డిప్యూటీ సీఎం తనిఖీలతో అధికారులు అప్రమత్తం
» గంగవరం పోర్టులో సోదాలు



పౌర సరఫరాల శాఖ అధికారులు పట్టుకున్న బియ్యం

(విశాఖపట్నం/గాజువాక/మధురవాడ/జగదాంబ కూడలి-ఆంధ్రజ్యోతి)


పేదలకు ఉచితంగా ఇస్తున్న రేషన్ బియ్యంలో 70 నుంచి 80 శాతం పక్కదారి పడుతోంది. గతంలో రేషన్ డిపోల కేంద్రంగా జరిగిన ఈ కార్యక్రమం ఇప్పుడు మొబైల్ వాహనాల వద్దే సాగుతోంది. పేదలకు ఇచ్చే బియ్యాన్ని చిన్న వ్యాపారులు కొనుగోలు చేసి అనకాపల్లి జిల్లా చోడవరం ప్రాంతంలో గల ఒకటి, రెండు రైస్‌మిల్లుల ద్వారా కాకినాడ తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గడచిన ఐదేళ్లలో రేషన్ బియ్యం కాకినాడకు తరలించ దం ద్వారా రూ.కోట్లకు పడగెత్తిన ఇక్కడ మిల్లర్లపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు తాజాగా కొందరు ఫిర్యాదు చేశారు.

విశాఖ జిల్లాలో 5.29 లక్షల బియ్యం కార్డులు ఉన్నాయి. అందులో నాలుగున్నర లక్షలకుపైగా కార్డులు నగరంలో ఉండగా, మిగిలినవి ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి గ్రామీణ మండలాల్లో ఉన్నాయి. జిల్లాలో 641 డిపోలు, 314 ఎండీయూ వాహనాల ద్వారా ప్రతి నెలా ఎనిమిది వేల టన్నుల బియ్యం కార్డుదారుల కోసం విడుదల చేస్తున్నారు. అయితే మెజారిటీ కార్డుదారులు రేషన్ బియ్యం తినేందుకు ఇష్టపడడం లేదు. కొందరు మొబైల్ వాహనదారుల వద్దే బియ్యం వదిలేసి కిలోకు రూ.12 నుంచి రూ.15 వరకూ (ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో రేటు ఉంది) తీసుకుంటున్నారు. మరికొందరు ఉదయం, సాయంత్రం పూట డిపోలకు వెళ్లి అక్కడ వేలిముద్ర వేసి బియ్యానికి బదులు సొమ్ములు తీసుకుంటున్నారు. మరికొందరు మొబైల్ వాహనం వద్ద బియ్యం తీసుకుని ఇంటికి తీసుకువెళ్లి సమీపంలో కిరాణా దుకాణాలు/వీధుల్లో బియ్యం కొనుగోలు చేసే చిరు వర్తకులకు కిలో రూ.14 నుంచి రూ.17కు అమ్ముకుంటున్నారు. కార్డుదారుల నుంచి కొనుగోలు చేసే బియ్యంలో కొంత శాతం నగరంలో టిఫిన్ దుకాణాలు, మెస్‌లు, హోటళ్లకు వెళుతోంది. మిగిలింది ఆటోలు, వాహనాల ద్వారా బయటకు తరలిస్తున్నారు. ఇందులో ప్రధానంగా ఆటో డ్రైవర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. బియ్యం తరలింపు ప్రక్రియ మొత్తం పౌర సరఫరాల శాఖకు చెందిన చెకింగ్ ఇన్‌స్పెక్టర్లకు తెలుసుననేది బహిరంగ రహస్యం. మధురవాడ ప్రాంతంలో ఒక చెకింగ్ ఇన్‌స్పెక్టరు ఆదాయం నెలకు రూ.లక్షల్లో ఉందని రేషన్ డీలర్లు చెబుతున్నారు. డీలర్లు, మొబైల్ వాహనాలతో పాటు మధురవాడ మీదుగా బియ్యం తరలించే ఆటోల నుంచి భారీగా ముడుపులు తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. అక్రమ బియ్యం వ్యాపారంతోనే వన్‌టౌన్ ప్రాంతంలో గతంలో

... మిగతా 6వ పేజీలో

సీఎం రాక రేపు

» 6న 'డీప్ టెక్నాలజీ సదస్సు-2024'కు హాజరు
» అనంతరం వీఎంఆర్‌డీఏలో అధికారులతో సమీక్ష
» ఆ తరువాత పార్టీ కార్యాలయానికి...



విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం రాత్రి విశాఖపట్నం వస్తున్నారు. ఆయన ఆరో తేదీన నోవాటెల్‌లో జరిగే 'డీప్ టెక్నాలజీ సదస్సు-2024'లో పాల్గొంటారు. దీనిని గ్లోబల్ ఫోరం ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ నిర్వహిస్తోంది. దీనికి ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఠక్కర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సదస్సులో ప్రసంగించిన అనంతరం చంద్రబాబునాయుడు సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లి అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం పార్టీ కార్యాలయానికి కూడా వెళతారు.

వీఎంఆర్‌డీఏలో ఏర్పాట్లు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వీఎంఆర్‌డీఏ కార్యాలయానికి వస్తున్నందున ఆ పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అధికారులను కమిషనర్ విశ్వనాథన్ ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ప్రాంగణం అంతా తిరిగి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేశ్, సీఈ భవానీశంకర్, ఎస్ఈ బలరామరాజు, డీఎఫ్ఓ శివానీ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీల ఇష్టారాజ్యం

అనుమతులు లేకుండానే మందుల తయారీ

» కనీస నిబంధనలు పాటించని వైనం
» తరచూ ప్రమాదాలు జరుగుతున్నా మారని తీరు
» ఎవరిది లోపం?
» ఈ మారణ హోమానికి అంతం లేదా?
» పర్మిషన్ లేకుండా 'ఠాగూర్' ఫార్మాలో హెచ్‌ఐవీ, హెపటైటిస్-బి చికిత్సకు వినియోగించే మందు తయారుచేస్తున్నప్పుడే ప్రమాదం



ఠాగూర్ ఫార్మాలో ప్రమాదం జరిగిన ప్రాంతం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఫార్మా కంపెనీలు బరితెగించి వ్యవహరిస్తున్నాయి. ఠాగూర్ ఫార్మా ప్రమాదం ద్వారా ఇది స్పష్టమైంది. ఆ కంపెనీలో వారం క్రితం విషవాయువులు వెలువడి ఇద్దరు కార్మికులు మరణించగా, మరో 27 మంది అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా హెచ్‌ఐవీ, హెపటైటిస్-బి వ్యాధులకు వినియోగించే యాంటీ రిట్రోవైరల్ మందు (లామివుడీన్) తయారు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు విచారణలో తేలింది. ఈ విషయం ఇప్పటివరకూ బయటకు రాలేదు. కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాశ్ వెళ్లారు. ఆ ప్రాంత ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు కూడా ఫ్యాక్టరీని సందర్శించారు. కానీ ఎవరూ ఈ విషయంపై దృష్టిపెట్టలేదు.

అత్యంత కీలకమైన మందులు అనుమతులు లేకుండా తయారు చేస్తున్నారంటే...కంపెనీలపై పర్యవేక్షణ లేదని స్పష్టంగా అర్థమవుతోంది. ఎటువంటి పర్యవసానాలు ఎదురైనా ప్రభుత్వపరంగా పెద్దగా ఇబ్బంది ఉండబోదని యాజమాన్యాలు భావిస్తున్నట్టుగా ఉంది. అందుకే ఇలా కీలకమైన మందులను నైపుణ్యం లేని సిబ్బందితో, సరైన పర్యవేక్షణ, భద్రత కొరవడిన ప్రాంగణాల్లో తయారు చేస్తున్నారు. వరుస ప్రమాదాలు జరుగుతున్నా, భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు మొత్తుకుంటున్నా యాజమాన్యాలు పట్టనట్టుగానే ఉంటున్నాయి. ఎల్‌జీ పాలిమర్స్ ప్రమాద ఘటనలో కొరియా దేశానికి చెందిన యాజమాన్య ప్రతినిధులను అరెస్టు చేసి జైలుకు పంపించారు. కానీ ఆ తరువాత ప్రమాదాలు జరిగిన ఎసెన్షియా యాజమాన్యంపై గానీ, ఇతర ఫార్మా కంపెనీలపై గానీ ఇప్పటివరకూ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. బాధితులకు నష్టపరిహారం ఇప్పించి యథాతథంగా ఉత్పత్తులు చేసుకోవడానికి పాలకులు అనుమతి ఇస్తున్నారు. అదే

... మిగతా 6వ పేజీలో

ఏం జరిగిందో...

» అమలాపురానికి చెందిన ప్రేమ జంట విశాఖలో ఆత్మహత్య

అక్కిరెడ్డిపాలెం/అమలాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):



మృతుడు పిల్లి దుర్గారావు (ఫైల్ ఫొటో)



మృతురాలు సాయిసుస్మిత

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన పిల్లి దుర్గారావు (28), ఎన్.సాయిసుస్మిత (25) జీవీఎంసీ 69వ వార్డు పరిధిలో గల వెంకటేశ్వర కాలనీలో ఓ అపార్టుమెంట్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడం స్థానికంగా కలకలం సృష్టించింది. అమలాపురం మద్దాలవారిపేట సమీపంలో గల రంగా క్యాంటీన్ నిర్వాహకుడు పిల్లి శ్రీనివాసరావు రెండో కుమారుడు దుర్గారావు, పట్టణంలోని విద్యుత్ నగర్‌కు చెందిన ఎన్.పల్లంరాజు కుమార్తె సాయిసుస్మిత (26) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. దుర్గారావు వెంకటేశ్వర కాలనీలోని ఎస్ఎన్ వినాయక ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటూ క్యాటరింగ్‌తో పాటు బిర్యానీ పాయింట్ నిర్వహిస్తున్నాడు. సుస్మిత బీటెక్ చేసి ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తోంది. ఇదిలావుండగా వారం కిందట సుస్మిత నగరంలో ఉంటున్న దుర్గారావు వద్దకు వచ్చింది. ఆదివారం ఉదయం అరకులోయ వెళ్లి సోమవారం సాయంత్రం తిరిగి వచ్చారు. ఆ తరువాత ఏం జరిగిందో మంగళవారం వేకువ జామున అపార్టుమెంట్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. అందుకు గల కారణాలు తెలియరాలేదు. అయితే అపార్టుమెంట్‌లోని మూడో అంతస్థులో దుర్గారావు ఉంటున్న ఫ్లాట్‌ను బుధవారం ఉదయం పరిశీలించిన పోలీస్ అధికారులు... అక్కడ సామగ్రి చిందరవందరగా ఉండడాన్ని గుర్తించారు. వారి మధ్య ఏదో గొడవ జరిగి ఉంటుందని, ఈ క్రమంలో క్షణికావేశంతో ఆత్మహత్య చేసుకొని ఉంటారని అనుమానిస్తున్నారు.

జల వనరుల శాఖ ఎస్ఈగా రామ్‌గోపాల్

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖ విశాఖ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా తిరుపతిలో హెచ్ఎన్ఎస్ఎస్ సర్కిల్-1 ఎస్ఈగా ఉన్న డి.రామ్‌గోపాల్ నియమితులయ్యారు. ఇక్కడ ఎస్ఈగా పనిచేస్తున్న ఎస్.సుగుణాకరరావును ఏలూరులో పీఐపీ-ఆర్ఎంసీ సర్కిల్ ఎస్ఈగా బదిలీ చేశారు. ఈ ఏడాది అక్టోబరులో విజయనగరం రామతీర్థ సాగర్ ప్రాజెక్టు ఎస్ఈగా ఉన్న సుగుణాకరరావును విశాఖ బదిలీ చేశారు. విశాఖ కేంద్రంగా పనిచేస్తున్న నార్తు కోస్టు సీఈగా కూడా సుగుణాకరరావు అదనపు బాధ్యతలు నిర్వహించేవారు. అయితే గత నెలలో నార్త్ కోస్ట్ సీఈగా తిరుపతిలోని హెచ్ఎన్ఎస్ఎస్ సర్కిల్-1 ఎస్ఈ రామ్‌గోపాల్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. సుగుణాకరరావుకు విజయవాడలో డిజైన్స్ సీఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే పని సౌలభ్యం కోసం తిరుపతిలో ఉన్న రామ్‌గోపాల్‌ను విశాఖకు బదిలీ చేశారు. సుగుణాకరరావుకు ఏలూరుకు బదిలీ చేసి అక్కడకు సమీపంలోని విజయవాడలో డిజైన్స్ సీఈగా బాధ్యతలు అప్పగించారు.

11న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 11న నిర్వహించనున్నట్టు కార్యదర్శి బి.వెంకటరమణ తెలిపారు. సమావేశంలో చర్చించేందుకు 40 అంశాలతో ఎజెండా తయారుచేసి సభ్యులకు పంపిణీ చేశారు. ఈ సమావేశంలోనే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌పై చర్చించే అవకాశం ఉంది.

అక్రమార్కులపై డ్రోన్ ప్రయోగం



» ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై కొరడా
» ఉల్లంఘన స్థాయిని బట్టి చర్యలు
» జీవీఎంసీ కమిషనర్ యోచన
» పైలట్ ప్రాజెక్టు కింద మొదట ఒక జోన్‌లో ప్రారంభం
» ఫలితాలను చూసి మిగిలిన జోన్‌లలోనూ సర్వే



కృష్ణా కాలేజీ వెనుక ప్లాన్‌కు విరుద్ధంగా కార్పొరేటర్ దంపతులు నిర్మించిన భవనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేందుకు 'డ్రోన్'లను వినియోగించాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ నిర్ణయించారు. పైలట్ ప్రాజెక్టు కింద ముందుగా ఒక జోన్‌ను ఎంపిక చేసి డ్రోన్‌లతో సర్వే చేయించాలని భావిస్తున్నారు. ఫలితాలను బట్టి మిగిలిన జోన్‌లకు సంబంధించి నిర్ణయం తీసుకోవాలని యోచిస్తున్నారు. అన్నీ అనుకున్నట్టు జరిగితే ఈ నెలలోనే కార్యరూపం ఇవ్వనున్నారు. ఉల్లంఘన స్థాయిని బట్టి అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోనున్నారు.

జీవీఎంసీ పరిధిలో ఏటా కొత్త భవనాల నిర్మాణం కోసం సుమారు మూడు వేల వరకూ దరఖాస్తులు వస్తుంటాయి. అందులో వెయ్యి వరకూ గ్రూప్‌హౌస్‌లు, అపార్టుమెంట్లు నిర్మాణానికి సంబంధించినవి కాగా మిగిలినవి వ్యక్తిగత ఇళ్ల నివాసాలకు సంబంధించినవి ఉంటాయి. అయితే వ్యక్తిగత ఇళ్ల నిర్మాణానికి ప్లాన్ తీసుకున్న వారిలో సగం మంది గ్రూప్‌హౌస్‌లు నిర్మిస్తుంటారు. అపార్టుమెంట్ల నిర్మాణంలో కూడా బిల్డర్లు సెట్‌బ్యాక్‌లు విడిచిపెట్టకపోవడం, చిన్న రోడ్డును పెద్దదిగా చూపించి ప్లాన్ తీసుకోవడం, టెర్రస్‌పై అదనపు గదుల నిర్మాణం వంటి ఉల్లంఘనలకు పాల్పడుతుంటారు. మొత్తంగా పరిశీలిస్తే జీవీఎంసీ జారీచేసే ప్లాన్ ప్రకారం జరిగే నిర్మాణాలు కేవలం పది శాతం మాత్రమే ఉంటాయి. మిగిలినవన్నీ ఏదో ఒక రకమైన ఉల్లంఘనతోనే నిర్మాణాలు జరుగుతుంటాయి. కొందరైతే తీసుకున్న ప్లాన్ కంటే ఒకటి, రెండు అంతస్థులు అదనంగా నిర్మించేస్తుంటారు. దీనివల్ల ఏదైనా ప్రమాదం జరిగితే సహాయక చర్యలకు అవకాశం లేక ఇబ్బందులు

... మిగతా 6వ పేజీలో

విమానయానం రయ్...రయ్...

» గత ఏడాది నవంబరులో దేశీయ ప్రయాణికులు 2,06,213 మంది
» ఈ సంవత్సరం నవంబరులో 2,40,494 మంది 16.62 శాతం వృద్ధి
» విదేశీ ప్రయాణికుల్లో 83.45 శాతం పెరుగుదల
» గణనీయంగా పెరిగిన విమానాల సంఖ్య

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయం ప్రతి నెలా ప్రయాణికుల సంఖ్య పెంచుకుంటూ అభివృద్ధి పథాన రయ్...రయ్ మంటూ దూసుకువెళుతోంది. నవంబరు నెలలో 16.62 శాతం వృద్ధి రేటు సాధించింది. గత ఏడాది (2023) నవంబరులో దేశీయంగా 2,06,213 మంది ప్రయాణించగా ఈ నవంబరులో 2,40,494 మంది ప్రయాణం చేశారు. విమానాల సంఖ్య కూడా గణనీయంగానే పెరుగుతోంది. విశాఖ నుంచి వివిధ నగరాలకు గత నవంబరులో 1,505 విమానాలు రాకపోకలు సాగించగా, ఈ నవంబరులో ఆ సంఖ్య 1,775కు చేరింది. ఇక అంతర్జాతీయ ప్రయాణికులను పరిశీలిస్తే 83.45 శాతం వృద్ధి కనిపిస్తోంది. గత నవంబరులో 5,165 మంది సింగపూర్, మలేషియాల దేశాలకు వెళ్లి రాగా, ఈ నవంబరులో బ్యాంకాక్ కూడా తోడు కావడంతో ప్రయాణికుల సంఖ్య 9,475కు చేరింది. గత నవంబరులో కేవలం 35 విమానాలే విదేశాలకు వెళ్లి రాగా, ఈ నవంబరులో 120 శాతం వృద్ధి రేటుతో ఆ సంఖ్య 77కు చేరిందని విమానాశ్రయం డైరెక్టర్ రాజారెడ్డి తెలిపారు.

స్కిల్ హబ్‌లలో నిరుద్యోగులకు శిక్షణ

మూడు నుంచి ఆరు నెలలపాటు...

» అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగ అవకాశం
» రిజిస్ట్రేషన్‌కు నేడే తుది గడువు

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం, నైపుణ్యాభివృద్ధి సంస్థ, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని తొమ్మిది స్కిల్ హబ్‌లలో ఉద్యోగార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆయా కోర్సుల్లో మూడు నుంచి ఆరు నెలలపాటు శిక్షణ ఇవ్వడంతోపాటు ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నారు.



రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లలో సుమారు 25 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఉన్న అన్ని మార్గాలను అన్వేషిస్తోంది. ముఖ్యంగా నైపుణ్య శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఎక్కువ మంది యువతకు శిక్షణ ఇచ్చి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు స్కిల్ హబ్‌ల ద్వారా అర్హులైన నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఇందులో భాగంగానే ప్రత్యేక కోర్సుల నిర్వహణకు స్కిల్‌హబ్‌ల అధికారులు ఏర్పాట్లుచేశారు. కొద్దిరోజుల్లో శిక్షణ ప్రారంభం కానుంది. భీమిలిలోని గవర్నమెంట్ మహిళా పాలిటెక్నిక్ కాలేజీలోని స్కిల్ హబ్‌లో అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణకు హాజరుకావాలనుకునే వారు 955 3558191 నంబర్‌కు సంప్రతించాలి. అలాగే ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో డ్రోన్ మాన్యుఫ్యాక్చరింగ్, అసెంబ్లీ టెక్నీషియన్ కోర్సు (7287069457), పాత ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో లైన్‌మన్ డిస్ట్రిబ్యూషన్ టెక్నీషియన్ (8555868681), పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో అసిస్టెంట్ మాన్యువల్ మెటల్ ఆర్క్ వెల్డింగ్/షీల్డ్ మెటల్ ఆర్క్ వెల్డింగ్ వెల్డర్ (90147 66143), గాజువాక ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో టెక్నికల్ ఎలక్ట్రీషియన్ (8121743777), నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ

... మిగతా 6వ పేజీలో

వైభవంగా సిరి, సింహాద్రినాథుల నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

సింహాచలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలుయథావిధిగా జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించిన వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. పాంచరాత్రాగమ శాస్త్రవిధానంలో కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు కావించి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలను జరిపించారు. స్వామికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

పింఛన్ల అవకతవకలపై విచారణ చేపట్టాలి

కొమ్మాది, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పేదవారికి అందాల్సిన ప్రభుత్వ పథకాలు అనర్హులకు అందుతున్నాయని, దీనిపై జిల్లా కలెక్టర్ పూర్తి స్థాయి విచారణకు ఆదేశించాలని విశాఖపట్నం టీడీపీ పార్లమెంటరీ అధికార ప్రతినిధి, ఆ పార్టీ 6వ వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదవారికి, ఒంటరిమహిళలు, దివ్యాంగులు, వృద్ధులకు ప్రతినెలా ఇస్తున్న పింఛన్ల మంజూరులో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ముఖ్యంగా దివ్యాంగుల పింఛన్లకు సంబంధించి అనర్హులు కూడా పింఛన్లు పొందుతున్నారని, దీనివల్ల అర్హులకు అన్యాయం జరుగుతోందన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టలన్నారు.

మంచం పట్టిన గ్రామాలు

- విజృంభిస్తున్న జ్వరాలు
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- పారిశుధ్య లోపంతో పంచాయతీలు

పద్మనాభం (రూరల్), డిసెంబరు 3 :పల్లెలు మంచంపట్టాయి. వైరల్, టైఫాయిడ్, మలేరియా తదితర విషజ్వరాలతో జనాలు అల్లాడిపోతున్నారు. ఇంటికి ఒకరిద్దరు చొప్పున జ్వర పీడితులుంటున్నారు. ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. సీజనల్ జ్వరాల ప్రభావం కనిపిస్తోంది. అలాగే పలు గ్రామాల్లో డెంగ్యూ కేసులు కూడా నమోదయ్యాయి. అప్పట్లో ఒకరిద్దరు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం రోజుల తరబడి జ్వరాలు తగ్గకపోవడంతో భయాందోళనకు లోనవుతున్నారు. డెంగ్యూ, మలేరియా తదితర జ్వరాలపై అనుమానంతో భయపడుతున్నారు. రేవిడి పీహెచ్‌సీలో రోజుకు దాదాపు వంద వరకు ఓపీ నమోదవుతుండగా, వీరిలో సగం మంది జ్వర పీడితులే ఉంటు న్నారు. ప్రైవేట్ వైద్యులు వైద్య పరీక్షల పేరిట పీడించుకుతింటున్నారు. టెస్టుల పేరిట వసూళ్లకు



రోగులకు కిటకిటలాడుతున్న ఆస్పత్రి

పాల్పడుతుండడంతో సామాన్య, మధ్య, పేదవర్గాలు ఆర్థికంగాచితికిపోతున్నారు.

పారిశుధ్య లోపం

గ్రామాల్లో పారిశుధ్యం వ్యాధులకు మరింత ఆజ్యం పోస్తున్నాయి. డ్రైనేజీ సరిగాలేక మురుగునీరు నిలిచిపోయిదోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. దోమకాటుతో జ్వరాలు ప్రబలుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తతన్నారు. రెడ్డిపల్లి మేజర్ వంటి పంచాయతీలో కాలువల్లో దోమల నివారణకు కనీసం చర్యలుతీసుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఇవన్నీ వ్యాధులు విజృంభణకు దోహదపడుతున్నాయి.

కలుషిత నీరు

గ్రామాల్లో తాగునీటి సమస్య ప్రజలను వేధిస్తోంది. గ్రామాల్లో తాగునీటి వనరులు కలుషితమవుతున్నాయి. దీనికి తోడు పంచాయతీల్లో ఫిల్టర్ బెడ్ పనిచేయకపోవడంతో కనీసం బ్లీచింగ్ కూడా వినియోగించని నీటిని కొళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. చేసేది లేక ఆ నీటిని ఉపయోగిస్తున్నట్టు పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా పంచాయతీల్లో అధి కారులు పారిశుధ్యపనులు, క్లోరినేషన్‌పై శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది.

పారిశుధ్యం, కలుషిత నీరే కారణం

పారిశుధ్యం లోపం, కలుషిత నీటిని తాగడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రస్తుతం జ్వర బాధితులు అధికంగా ఉంటున్నాయి. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. ఇళ్ల పరిసరాల్లో మురుగునీరు, చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలి.

- కె.స్వప్న, వైద్యాధికారి, రేవిడి పీహెచ్‌సీ

విశాఖ టు కాకినాడ.. వయా చోడవరం

... 5వ పేజీ తరువాయి

కలాసీగా పనిచేసిన ఒక వ్యక్తి ఇప్పుడు కోట్లు సంపాదించారని ఆ ప్రాంతంలో డీలర్లు చెబుతుంటారు. గాజువాక, షీలానగర్, గోపాలపట్నం, పెందుర్తి, మధురవాడ ప్రాంతాల నుంచి ఆనందపురం, పెందుర్తి మీదుగా చోడవరం ప్రాంతానికి భారీగా రేషన్ బియ్యం తరలిపోతున్నాయి. కొందరు ఆనందపురం పరిసరాల్లో మిల్లులకు అమ్ముతున్నారు. ఇటీవల విజయనగరం జిల్లాలో మిల్లులకు విక్రయిస్తున్నారు. చోడవరం ప్రాంతానికి వెళ్లే రేషన్ బియ్యానికి కొంత పాలిష్ పెట్టి కాకినాడ తరలిస్తున్నారు. ఒక్కొక్కసారి వచ్చిన బియ్యం వచ్చినట్టే కాకినాడకు పంపుతుంటారు. ఈ వ్యవహారంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఒకరు స్వయంగా ఫిర్యాదు చేశారు.

గంగవరం పోర్టులో తనిఖీలు

కాకినాడ పోర్టు నుంచి ఆఫ్రికా దేశాలకు రేషన్ బియ్యం ఎగుమతి చేసే నౌకను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పట్టుకున్న నేపథ్యంలో అన్ని జిల్లాల్లో రేషన్ బియ్యం అక్రమాల గుట్టు తేల్చాలని ప్రభుత్వం ఆదేశించింది. విశాఖలో జేసీ మయూర్ అశోక్ కొద్దిరోజులుగా రేషన్ బియ్యం వ్యాపారంపై నిఘా పెట్టారు. ఆయన ఆదేశాల మేరకు పౌర సరఫరాల శాఖ అడపా దడపా దాడులు చేస్తుంది. తాజాగా కాకినాడ వ్యవహారంతో పౌర సరఫరాల గాజువాక ఏఎస్‌వో సోమవారం సాయంత్రం గంగవరం పోర్టును తనిఖీ చేశారు. గంగవరం పోర్టు నుంచి బియ్యం ఎగుమతులు లేవని నిర్ధారించారు. విశాఖ పోర్టు నుంచి బియ్యం ఎగుమతులను తనిఖీ చేయాలని నిర్ణయించారు. ఇందుకు జిల్లా యంత్రాంగం ద్వారా పోర్టు అనుమతి తీసుకోవాల్సి ఉంది. సోమవారం రాత్రి మల్కాపురం ప్రాంతంలోని క్రాంతినగర్, గాజువాక వుడా కాలనీల్లో రెండు ఇళ్లపై జిల్లా పౌర సరఫరాల అధికారి భాస్కరరావు దాడి చేసి 40 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. కాగా నగరంలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసే ఇళ్లు, దుకాణాలపై దాడులు కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

దివ్యాంగ విద్యార్థులకు ట్రై సైకిళ్ల పంపిణీ

భీమునిపట్నం డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండల పరిషత్తు కార్యాలయంలో ఉన్న భవిత కేంద్రంలో మంగళవారం ముగ్గురు దివ్యాంగ విద్యారులకు ట్రై సైకిళ్లను అధికారులు, ప్రజాప్రతినిదులు అందించారు. ఈ కార్యక్రమానికి మండలవిద్యాశాఖాధికారి ఎం.శివరాణి అధ్యక్షత వహించారు. డైట్ వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, లక్ష్మీపురం గెజిటెడ్ హెచ్‌ఎం జి.పైడిరాజు టీడీపీ నాయకులు గంటా నూకరాజు, ఉన్నత పాఠశాలల్లో దివ్యాంగుల విద్యా బోధకులు పలువురు పాల్గొన్నారు.



దివ్యాంగ విద్యార్థులకు ట్రై సైకిళ్లను అందజేస్తున్న ఎంఈవో శివరాణి

కళాసాహితి కార్యదర్శి సన్యాసిరాజు మృతి

శబరిమలై యాత్రలో గుండెపోటుతో దుర్మరణం



సన్యాసిరాజు (ఫైల్)

భీమునిపట్నం డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భీమిలి కళాసాహితి ప్రధాన కార్యదర్శిగా ఉన్న అడిదం సన్యాసిరాజు శబరిమలై యాత్రకు వెళ్లి మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఈ సమాచారాన్ని అక్కడి నుంచి భీమిలి వాసులకు చేరడంతో భీమిలిలో విషాద వాతావరణం నెలకొంది. గత కొన్ని సంవత్సరాలుగా గాయకుడిగా, కళాకారుడిగా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. ఆయనకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత ఆదివారం భీమిలిలో జరిగిన రచయితల సమావేశంలో చురుగ్గా వ్యవహరించిన ఈయన మృతికి కళాసాహితి అత్యవసర సమావేశం సంతాపాన్ని తెలియజేసింది. హిందూ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు మైలపల్లి షణ్ముఖరావు అయ్యప్పసేవా పీఠం సభ్యులు సంతాపాన్ని తెలియజేశారు.

అప్పన్న నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరానికి చెందిన ఎంనరసింహకుమార్ రూ.లక్ష విరాళం అందజేశారు. విరాళం మొత్తం రూ.1,11,111లను చెక్ రూపంలో పీఆర్వో కార్యాలయ సిబ్బంది సూర్యనారాయణకు మంగళవారం అందజేశారు.



విరాళం అందజేస్తున్న నరసింహకుమార్

సకాలంలో గృహ నిర్మాణాలు : జడ్పీ సీఈవో

భీమునిపట్నం (రూరల్) డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండలంలో నిర్మాణంలో ఉన్న గృహాలను సకాలంలో పూర్తి చేయాలని జడ్పీ సీఈవో రాజకుమార్ ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్తు కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ గృహాల నిర్మాణం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వద్దన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పేదలకు ఇళ్లు అందించే లక్ష్యంతో ఉందన్నారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాలు సాగేలా చూడాలన్నారు. ఎక్కడా నాణ్యత లోపించకుండా జాగ్రత్త వహిచాలన్నారు. వివిధ గ్రామాలలో నిర్మాణ ప్రగతిని సహా ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు సమావేశంలో గృహనిర్మాణశాఖ అధికారులు, ఎంపీడీవో హన్మంతరావు, తహశీల్దారు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

యాజమాన్యాలకు అలుసుగా మారినట్టు ప్రచారం జరుగుతోంది.

ఠాగూర్ యాజమాన్యం యూనిట్-3లో 17 రకాల మందుల తయారీకి ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుంది. అందులో లామివుడీన్ లేదు. కానీ ఉత్పత్తి చేస్తున్నారు. మొదటి బ్యాచ్ మందు తయారు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ఇలా అనుమతులు లేకుండా అత్యంత కీలకమైన మందులు తయారుచేయవచ్చునా?, ఇలాంటి అంశాలను అధికారులు తనిఖీల ద్వారా గుర్తించి చర్యలు చేపట్టరా?...అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పెట్టుబడులు, ఉపాధి అనే అంశాల ఆధారంగా ఫార్మా కంపెనీలు ఏమి చేస్తున్నా పాలకులు పెద్దగా స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ వరుస ప్రమాదాలపై హై లెవెల్ కమిటీ విచారణ జరుగుతున్న సమయంలోనే మళ్లీ పునరావృతం కావడం మరో విశేషం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందిస్తుందా? కఠిన చర్యలు తీసుకుంటుందా?...అనేది చూడాలి. ఇలాంటి అనుమతి లేని ఉత్పత్తులు ఇంకా ఎక్కడెక్కడ జరుగుతున్నాయో గుర్తించి, తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

అక్రమార్కులపై డ్రోన్ ప్రయోగం

... 5వ పేజీ తరువాయి

ఏర్పడుతుంటాయి. అక్రమ నిర్మాణదారుల వద్ద టౌన్‌ప్లానింగ్ విభాగంలోని కొందరు అధికారులు, సిబ్బందితోపాటు కార్పొరేటర్లు, మీడియా పేరుతో మరికొందరు బెదిరింపులకు దిగడం, బలవంతపు వసూళ్లకు పాల్పడుతుంటారు. నిర్మాణదారుడు డబ్బులు ఇవ్వకపోతే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (స్పందన)లో ఫిర్యాదు చేస్తుంటారు. స్పందనకు వచ్చే ఫిర్యాదుల్లో అత్యధికం టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించినవి...అందులోనూ అక్రమ నిర్మాణాలకు సంబంధించినవే అధికంగా ఉంటున్నాయి. అదే విషయాన్ని ఇటీవల మీడియా సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో నగరంలో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడంపై కమిషనర్ దృష్టిసారించారు.

డ్రోన్‌తో అక్రమ నిర్మాణాలు గుర్తింపు

నగరంలో అక్రమ నిర్మాణాలను గుర్తించేందుకు వీలుగా 'డ్రోన్' తో సర్వే చేయాలని నిర్ణయించినట్టు కమిషనర్ తెలిపారు. నగరం అంతా ఒకేసారి కాకుండా పైలట్ ప్రాజెక్టు కింద ఏదో ఒక జోన్‌ను ఎంపిక చేయాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఆటోకాడ్‌తో సర్వే చేసి నివేదిక తయారుచేసిన తర్వాతే ప్లాన్ జారీచేస్తారు కాబట్టి, ఆ సమాచారాన్ని ప్రస్తుత స్థితి తెలిపే జీఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్)తో అనుసంధానం చేసి డ్రోన్‌కు సాఫ్ట్‌వేర్‌ను అప్‌లోడ్ చేస్తామన్నారు. డ్రోన్ సర్వే చేసి ఆ రెండు నివేదికల ఆధారంగా భవన నిర్మాణాల్లో జరిగిన ఉల్లంఘనలు, ఏ స్థాయిలో జరిగాయనేది తెలియజేస్తుంది. వీటిని క్రోడీకరించిన తర్వాత అక్రమ నిర్మాణం స్థాయిని బట్టి చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో నిర్మించే భవనాలపై ప్రభుత్వానికి నివేదించి, అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు ముందుకు వెళతారు. ఇక అదనపు అంతస్థులు నిర్మించినా, సెట్‌బ్యాక్‌ల ఉల్లంఘనలు జరిగినా పది శాతంలోపు అయితే ఒక రకంగా, 25 శాతం వరకూ మరో రకమైన జరిమానా, అంతకంటే ఎక్కువ ఉల్లంఘన ఉంటే మరోలా చర్యలు తీసుకునే ఆలోచన ఉందని కమిషనర్ తెలిపారు. అన్నీ అనుకూలిస్తే ఈ నెలలలోనే పైలట్ ప్రాజెక్టు కింద డ్రోన్ సర్వే జరపాలని టౌన్‌ప్లానింగ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కోలాటం బృందానికి చీరల పంపిణీ

కొమ్మాది, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కళలు అంతరించిపోతున్న రోజుల్లో కోలాటం జానపద కళలు నేర్చుకోవడం ఆనందదాయకమని జనసేన 5వ వార్డు అధ్యక్షుడు దేవరశిత అన్నారు. మంగళవారం బోరవానిపాలెంలో కోలాటం మహిళా బృందానికి చీరలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దారపు సూరిబాబు, జాయింట్ సెక్రటరీఅయ్యప్ప, బి.శివ, జనసేన నేతలు, వీరమహిళలు పాల్గొన్నారు.



మహిళా కోలాటం బృందానికి చీరలు అందజేస్తున్న దేవరశిత తదితరులు

మాజీ రాష్ట్రపతికి ఘన నివాళి



తాటితూరులో బాబూ రాజేంద్రప్రసాద్‌కు నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

భీమునిపట్నం(రూరల్) డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భీమిలి మండలం తాటితూరు ప్రాథమిక పాఠశాలలో భారత తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి వే డుకల్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఘననివాళి అర్పిస్తూ దేశానికి చేసిన సేవల్ని ఉపాధ్యాయులు వివరించారు.

అనారోగ్యంతో సీపీఐ నాయకుడు మృతి



సోమరాజు (ఫైల్)

తగరపువలస, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నాయకుడు, ఏఐటీయూసీ నేత తూతిక సోమరాజు (84) మంగళవారం మధ్యాహ్నం చిట్టివలస సమీపంలోని కొత్తపేటలో ఆయన స్వగృహంలో మృతిచెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. భీమిలి మున్సిపాలిటీలో సీపీఐ తరుపున రెండుసార్లు కౌన్సిలరుగా ఎన్నికై పదేళ్ల పాటు సేవలందించారు. సోమరాజు మృతికి కార్మిక సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు.

పూర్వ విద్యార్థుల ఉదారత



చిట్టివలస ఉన్నత పాఠశాలలో షెడ్డు ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

తగరపువలస, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) చిట్టివలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1978లో పదో తరగతి చదివిన విద్యార్థులు రూ.25 వేల వ్యయంతో పాఠశాల ప్రాంగణంలో నిర్మించిన షెడ్డును ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్ మంగళవారం ప్రారంభించారు. ఈ ప్రాంగణంలో మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు రక్షణగా దీన్ని నిర్మించారు. ఈ ఏడాది అక్టోబరు 6న వీరంతా సమావేశమై పాఠశాలలో కనీస అవసరాలు తీర్చాలని తీర్మానించారు. అందుకు అనుగుణంగా అధ్యక్షుడు డి.వి. చలపతిరావు ఆధ్వర్యంలో నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విగ్రహాలకు పూలమాలలు వేసి మహనీయులకు నివాళులర్పించారు. పాఠశాలకు అవసరమైన మరిన్ని పనులు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గోపాలరావు, పి.నాగరాజు, డి.బంగార్రాజు, సుగుణాకరరావు, పంచముఖేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కబ్జా స్థలం నుంచి కట్టడం తొలగింపు

సాగర్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిన్న రుషికొండలో నకిలీ దస్త్రాలతో భూమి కబ్జాచేసి నిర్మిస్తున్న బహుళఅంతస్తుల భవన నిర్మాణాన్ని జోన్-2 పట్టణ ప్రణాళికా విభాగం ఏసీపీ తిరుపతిరావు, టీపీఓ బాలరాజుల ఆధ్వర్యంలో మంగళవారం తొలగించారు. భూ యజమాని తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... చిన్నరుషికొండలో15 సెంట్ల స్థలం ఖాళీగా ఉండడంతో దానిపై ఇద్దరి కన్ను పడింది. నకిలీ దస్త్రాలు సృష్టించి దర్జాగా బహుళ అంతస్తుల భవన నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న భూ యజమాని పలుసార్లు సర్వేకు ఆహ్వానించగా తప్పించుకు తిరిగేవారు. ఈ క్రమంలో సర్వే నివేదికను జీవీఎంసీ పట్టణ ప్రణాళికా అధికారులకు ఆయన అందజేశారు. పరిశీలించిన అధికారులు అక్రమ కట్టడంగా నిర్ధారించి సిబ్బంది సహాయంతో తొలగించారు.



చిన్న రుషికొండలో అక్రమ కట్టడాన్ని తొలగిస్తున్న జీవీఎంసీ పట్టణ ప్రణాళికా అధికారులు, సిబ్బంది

'అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి'



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో రాజశేఖర్

ఆనందపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో అమలవుతున్న అభివృద్ధి పనులపై జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో కె.రాజశేఖర్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. 26 పంచాయతీల్లో ప్రధాన సమస్యలు గుర్తించి ప్రాధాన్యక్రమంలో నిధులు మంజూరు చేయాలని సూచించారు. ఇటీవల వివిధ పంచాయతీలకు మంజూరైన సీసీ రోడ్లు, బీటీ రోడ్లు పనుల పురోగతిని ఏఈ, డీఈల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ పథకాల అమలుపై సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ జానకి, అధికారులు పాల్గొన్నారు.

చిప్పాడలో 310 మందికి కంటి వైద్య పరీక్షలు

భీమునిపట్నం (రూరల్) డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) భీమిలి మండలం చిప్పాడలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరంలో 310 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. విశాఖకు చెందిన ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి వైద్యులు సేవలందించారు. పరీక్షలు చేయించుకున్నవారిలో 170 మందికి కంటి అద్దాలు అమర్చాలని నిర్ణయించారు. 75 మందికి కంటిలో శుక్లాల శస్త్రచికిత్స చేయవలసి ఉంటుందని నిర్ధారించారు. ఆసుపత్రి సహకారంతో దశలవారీగా శస్త్రచికిత్సలు చేయిస్తామని పేర్కొన్నారు. ఆసుపత్రి సమన్వయకర్త స్వామి, అప్తమాలజిస్టు డా.నాగలక్ష్మి, డా.శారద తదితరులు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దివీస్ జనరల్ మేనేజరు ఎం.ఎస్.ఎన్.రావు మాట్లాడుతూ కంటి పరీక్షలు చేయించుకున్నవారికి అవసరమైన సహాయం సంస్థ తరపున అందిస్తామన్నారు.నగరపాలెం, అన్నవరం, చిప్పాడ, నాగమయ్యపాలెం, గుడివాడ, తూడెం తదితర పంచాయతీల ప్రజలు హాజరయ్యారు. దివీస్ సామాజిక సేవా విభాగ ప్రతినిధులు డి.సురేష్, నర్సింహ, శ్రీనివాస్, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

'రాయితీలు వినియోగించుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో గంగరాజు

ఆనందపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వినియోగించుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని మండల విద్యాశాఖాధికారి కె.గంగరాజు సూచించారు. మంగళవారం ఆనందపురం భవిత కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి పథకాలు వినియోగించుకుని మంచి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. దివ్యాంగులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు చందక సూరిబాబు, ఎంపీటీసీ కొట్యాడ రమాదేవి, ఉపాధ్యాయుడు కలమటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'జాగ్రత్తలతోనే పంట నష్టం నివారణ'

ఆనందపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో తుఫాన్‌కు దెబ్బతిన్న వరి పంట పొలాలను వ్యవసాయాధికారిణి సి.హెచ్.సంధ్య రత్నప్రభ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 26 పంచాయతీల్లోని 1,620 ఎకరాల్లో వరి పంట నమోదు కాగా, చాలా వరకు కోతలు జరిగాయన్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సుమారు 55 ఎకరాల వరకు పంట నష్టం జరిగిందని, కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నష్టాలు తగ్గించుకోవచ్చని సూచించారు. కోసేసి ఆరబెట్టి ఉన్న పంట తుఫాన్ వర్షం వల్ల తడిస్తే పనల మీదే వరి కంకులు మొలకెత్తే ప్రమాదం ఉందని, ధాన్యం మొలకెత్తకుండా ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కొన్ని పొలాల్లో చేలు పడిపోయిన సందర్భాల్లో వెంటనే పాయలు తీసి పక్కపక్క ఉన్న దుబ్బులను కలిపి కట్టలుగా కట్టి నిలబెట్టాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా బోని, గొట్టిపల్లి పంచాయతీకు వెళ్లి రైతులకు సూచనలిచ్చారు.



తడిసిన వరిపొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారిణి సంధ్య

ఉప్పుద్రావణం పిచికారీ చేయాలి

పద్మనాభం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోసిన వరిపంట నీటిలో ఉంటే గింజలు మొలకెత్తకుండా రైతులతో ఉప్పు ద్రావణం పిచికారీ చేయించాలని రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జిలకు పద్మనాభం మండల వ్యవసాయాధికారి ఎంవీఎస్ చలం సూచించారు. వర్షాలకు రైతులు కోసిన వరిపంట పొలాల్లోనే పసలపై ఉందన్నారు. నీటిలో ఉన్నందున వరికంకులు మొలకెత్తే ప్రమాదం ఉందన్నారు. దీని నివారణకు లీటరు నీటికి 20 గ్రాముల గళ్ల ఉప్పును ట్యాంకు నీటికి 250 గ్రాముల వంతున కలిపి పిచికారి చేయించాలన్నారు. రైతులు ఇలా చేయడం వల్ల పంట నష్టం నివారించి దిగుబడులు యథావిధిగా పొందవచ్చన్నారు.

స్కిల్ హబ్‌లలో నిరుద్యోగులకు శిక్షణ

... 5వ పేజీ తరువాయి

కళాశాలలో కోర్సు ఆన్ కంప్యూటర్ కాన్సెప్ట్ (9121676360), డాక్టర్ వీఎస్ కృష్ణ డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో ఆఫీస్ అసిస్టెంట్ (9885694676), గాజువాకలోని నాక్ శిక్షణ కేంద్రంలో అసిస్టెంట్ ప్లంబర్ జనరల్ (9493837994), నగర పరిధిలోని నాక్ శిక్షణ కేంద్రంలో గల స్కిల్ హబ్‌లో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సు (9676170026)లో శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు వెల్లడించారు. ఆయా కోర్సుల్లో చేరాలనుకునే జిల్లాకు చెందిన అభ్యర్థులు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ నెల నాలుగో తేదీ (గురువారం) వరకూ రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందని వివరించారు. నాన్ రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఉంటుందని, అనంతరం అభ్యర్థులకు సర్టిఫికెట్‌తోపాటు అసెస్‌మెంట్ టెస్ట్ నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. స్వయం ఉపాధి పొందేలా యూనిట్లు పెట్టుకుంటామనుకునే వారికి అవసరమైన సహకారాన్ని అందిస్తామని తెలిపారు.

కార్మికుల సస్పెన్షన్‌పై కాగడాలతో నిరసన

ఎన్‌ఏడీ జంక్షన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సాకేతపురం ఎన్‌ఏడీ కార్టర్స్‌లో ఉన్న ఎన్‌ఏడీ కార్యాలయం ఎదుట ఎన్‌ఏడీ సీఈ యూనియన్ నాయకులు, కార్మికులు మంగళవారం నిరశన దీక్షతో పాటు కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు థామస్ మాట్లాడుతూ ఎన్‌ఏడీ యాజమాన్యం తీసుకున్న తప్పుడు నిర్ణయాలను ఇప్పటికైనా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులను భయపెట్టి ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నేవల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు రెడ్డి వెంకట్రావు మాట్లాడుతూ విశాఖ నగరంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లోని యూనియన్లు తమ ఉద్యమానికి మద్దతు తెలిపినట్టు చెప్పారు. ఈ నెల 12న అన్ని యూనియన్లు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. అంతకుముందు ఎన్‌ఏడీ గేటు నుంచి సాకేతపురం అంబేడ్కర్ విగ్రహం వరకు కాగడాలతో ర్యాలీ నిర్వహించారు.యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, అధ్యక్షుడు పి.నూకరాజు, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

దివ్యాంగ క్రికెట్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



దివ్యాంగుల క్రీడా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి, తదితరులు

గాజువాక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9 నుంచి 11 వరకు గాజువాక జింక్ మైదానంలో నిర్వహించనున్న దివ్యాంగుల రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల పోస్టర్‌ను మంగళవారం గాజువాక బీజేపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పది జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరవుతున్నారని, దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గురునాథరెడ్డి, నరసింహ, సునీల్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

అప్పన్న ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు

సింహాచలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసాన్ని పురస్కరించుకుని సింహాద్రినాథుని సన్నిధిలో వైదిక ఉత్సవాలు జరుగనున్నాయి. అన్ని గురువారాలు, 29 ఆదివారాల్లో ఉదయం 7.30గంటలకు ఆర్జిత స్వర్ణ పుష్పార్చనలు జరుగుతాయి. సింహవల్లీ తాయార్ సన్నిధిలో ప్రతి శుక్రవారం ఉదయం 7.30 గంటలకు సహస్ర కుంకుమార్చన, సాయంత్రం 5 గంటలకు తిరువీధి ఉత్సవాలు ఉంటాయి. ఈనెల 6 శ్రవణం నక్షత్రం పురస్కరించుకుని కొండదిగువ పద్మావతి, అలిమేలుమంగా సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సుదర్శన హోమం, 9న అప్పన్న సన్నిధిలో తిరుమంగైళ్వార్ తిరునక్షత్ర ఉత్సవాలు ఆరంభమవుతాయి. 11న మార్గశిర మాస శుక్లపక్ష ఏకాదశి అప్పన్నస్వామికి స్వర్ణ తులసి దళార్చన, గీతాజయంతి, సాయంత్రం తిరువీధి, 12న ద్వాత్రింశతి (32రోజుల) నృసింహ దీక్షల ప్రారంభం, 13న తిరుమంగైళ్వార్ తిరునక్షత్ర చాత్తు, 14నమాస జయంతి, తిరుప్పాణాళ్వార్ తిరునక్షత్రం, తిరువీధి, మాధవధారలోని మాధవస్వామి ఆలయంలో అష్టాక్షరీ హవనం, 15న వృశ్చిక పూర్ణిమ, వృశ్చిక దీపారాధన, ప్రబంధనిగమం, చొక్కప్పం తిరుక్కార్తి ప్రారంభం, రాత్రి ధూప సేవాంతర తిరువీధి, 16న ఉదయం 6.35 గంటలకు నెలగంట తో ధనుర్మాసోత్సవాలు ప్రారంభం, 17న పునర్వసు నక్షత్రం గంగధార సీతారామస్వామి ఆలయంలో అష్టాక్షరీ మంత్రపూర్వక సంక్షిప్త రామాయణ హవనం, 21న ఆండాళ్ అమ్మవారి మాస తిరునక్షత్రం, 26 స్వాతి నక్షత్ర హవనం, 30న గ్రామ బలి హరణం, 31 నుంచి పగల్‌పత్తు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

ఉక్కు పరిరక్షణకు ఐద్వా పోస్టుకార్డు ఉద్యమం

కూర్మన్నపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌సిటీ జోన్ ఐద్వా కమిటీ మహిళలు పోస్టుకార్డు ఉద్యమంలో భాగంగా మంగళవారం 86వ వార్డు ద్వారకాపురి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పోస్టుకార్డులు పంపిణీ చేసి ప్రజల మద్దతు కోరారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సత్యవతి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని విరమించుకోవాలని, తక్షణమే సంస్థ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు కె.విమల, కె.వేణు, వర లక్ష్మి, సుభాషిణి, ప్రభ, సుమలత, పద్మావతి, శాంతి పాల్గొన్నారు.

రికవరీ సొమ్ము చెల్లించాలి

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల నుంచి రికవరీ చేసిన పీఎఫ్, ఎస్‌బీఎఫ్ సొమ్మును ఆయా ట్రస్టులకు వెంటనే చెల్లించాలని స్టీల్ ఇంటక్ నాయకులు పే సెక్షన్ డీజీఎం రామ్ ప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం సమస్యలపై ఆయనతో చర్చించారు. నాయకులు మంత్రి రాజశేఖర్, పీవీ నగేష్, ప్రభాకర్ రెడ్డి, గోపాలరాజు, దేముడు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మెకానిక్ రాఖీ:** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **దేవకీనందన వాసుదేవ:** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **జీబ్రా:** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
- **కంగువా:** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **లక్కీభాస్కర్:** వెంకటేశ్వర
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 46, వంకాయలు (తెలుపు)28, వంకాయలు (నలుపు) 34, బెండకాయలు 18, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 30, క్యారెట్ 58 దొండకాయలు 32, బంగాళ దుంపలు 37, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 28 దోస కాయలు 26, వె ల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 50, కీరదోస 28, కాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడ దుంపలు 38, కంద 58, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 50, కరివేపాకు (కిలో) 55, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	92
ఫారం ధర	112
విత్ స్కిన్	194
స్కిన్‌లెస్	204

చెత్త తరలింపుపై నిర్లక్ష్యం

- చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం పక్కన పేరుకుపోయిన చెత్త
- ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ స్థానికుల ఆరోపణ



సాయిబాబా ఆలయం వద్ద డంపింగ్ యార్డును తలపిస్తున్న చెత్తకుప్పలు

ఆరిలోవ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం గోడకు ఆనుకొని చెత్తలు వేస్తుండడంతో ఆ ప్రాంతం డంపింగ్‌యార్డులా తయారైంది. దీన్ని చూసిన ఎవరైనా ఇది డంపింగ్ యార్డు అనుకుంటే అతిశయోక్తి కాదు. ఇక్కడ ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ సక్రమంగా చేపట్టకపోవడం, డంపింగ్ యార్డు లేకపోవడంతో స్థానికులు కొందరు ఆల యం సమీపంలో చెత్తాచెదారాలను పారవేస్తున్నారు.

ఈ చెత్త బాగా కుళ్లిపోయి దుర్వాసన వెలువడుతోంది. దీంతో స్థానికులతో పాటు ఇక్కడ ఉంటున్న అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములు ఇబ్బంది పడుతున్నారు. ముక్కు మూసుకుంటే గాని ఇటు వైపు నుంచి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. చెత్త కారణంగా దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో దోమల కుట్టి ఏ వ్యాధులు సోకుతాయోనని ఆందోళన చెందుతున్నారు.

ఎప్పటి నుంచో ఈ సమస్య ఉన్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేశామని, అయినప్పటికీ పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి చెత్త తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సచివాలయం ఎదుట చిరు వ్యాపారుల ఆందోళన

- తోపుడు బండ్లు ఎత్తుకెళ్లడంతో నిరసన
- తాము తేలేదని సచివాలయ సిబ్బంది బుకాయింపు
- సీసీ టీవీ పుటేజీలు చూపించడంతో కంగుతిన్న సిబ్బంది



టీడీపీ నేత బొట్టా వెంకటమరణతో గోడు వెళ్లబోసుకుంటున్న తోపుడు బండ్ల వ్యాపారులు

మద్దిలపాలెం, డిసెంబరు 3 : పిఠాపురం కాలనీ రోడ్డులో రిపేర్లు చేసుకుంటున్న తోపుడు బండ్లు మాయమయ్యాయి. మంగళవారం ఉదయం చినుకులు పడుతున్నాయని ఇంటికి వెళ్లివచ్చేసరికి తమ బండ్లు కనిపించకపోవడంతో దుకాణదారులు అవాక్కయ్యారు. అయితే సచివాలయం సిబ్బంది తరలించుకు పోయారన్న విషయం తెలుసుకుని కళాభారతి సమీపంలో సచివాలయం వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు.

అదే సమయంలో సచివాలయానికి వచ్చిన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్‌ను చుట్టిముట్టారు. తాము వ్యాపారాలు చేయడం లేదని, ధ్వంసం చేసిన తోపుడు బండ్లకు మరమ్మతులు చేసుకుంటుంటే ఎందుకు ఎత్తుకెళ్లారని నిలదీశారు. ఇప్పటికే ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. పూట గడవక కడుపుమాడ్చుకునిఉంటున్నామని బావురుమన్నారు.

అయితే తాము తోపుడు బండ్లను తొలగించలేదని సచివాలయ కార్యదర్శులు చెప్పుకొచ్చారు. దీంతో చిరువ్యాపారులు ఎదురుగా ఉన్న భవనంలోని సీసీ టీవీ పుటేజీ తీసుకొచ్చి వారికి చూపించారు. టౌన్‌ప్లానింగ్ కార్యదర్శి జ్యోతి, శానిటేషన్ సూపర్‌వైజర్ గురువులు, సిబ్బంది.. రిపేర్లు చేస్తున్న తోపుడుబండ్లను తరలిస్తున్న దృశ్యాలు పుటేజీలో చూపించారు.

దీంతో ఏం చెప్పాలో తెలియని సచివాలయ సిబ్బంది.. తామే తోపుడుబండ్లను ఇక్కడకు తెప్పించామని అంగీకరించామని,ఇక్కడకు సమీపంలోనే ఉంచామని చెప్పారు. వీధి వ్యాపారులు అక్కడకి వెళ్లి చూడగా, ఆ బండ్లలో ఉన్న వంటసామగ్రి కనిపించలేదు. దీంతో మళ్లీ సచివాలయ సిబ్బందిని నిలదీశారు. ఇదేం పనంటూ ఆందోళనకు దిగారు.

ఇంతలో టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ అక్కడకు చేరుకొని ఆందోళన చేస్తున్న చిరువ్యాపారులకు నచ్చజెప్పారు. వచ్చే సోమవారం నాటికి కళాభారతి రోడ్డులో ఎవరికి ఇబ్బంది లేకుండా మార్జిన్లు వేసి వ్యాపారాలకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం నిరాశ్రయులకు ఉపాధి కల్పిస్తుంది తప్ప ఎవరికీ అన్యాయం చేయదన్నారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా ఎవరు నడుచుకున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు సహించరని తెలిపారు. హైకోర్టు ఆదేశం ప్రకారం రోడ్డు మార్జిన్లు వేయించి అందులోనే వ్యాపారాలు చేసుకునేలా కృషి చేస్తానన్నారు. చిరువ్యాపారులకు ఉపాధి కల్పించే ఈ కార్యక్రమానికి ఎవరైనా అడ్డుతగిలితే ఇక్కడే దీక్ష చేద్దామని వీధివ్యాపారులకు చెప్పారు. వంటసామాగ్రి చోరికి గురైతే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.



విద్యార్థులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న చినగదిలి ఎంఈవో అనూరాధ

దివ్యాంగుల ప్రతిభ ఎవరికీ తీసిపోదు

- చినగదిలి ఎంఈవో అనూరాధ

ఆరిలోవ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను ప్రత్యేక అవసరాల విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని చినగదిలి మండల విద్యాశాఖాధికారి-2 పి.అనూరాధ పేర్కొన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం చినగదిలి మండలంలోని తోటగరువు ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల ప్రతిభ ఎవరికీ తీసిపోదన్నారు. కష్టపడితే ఏ రంగంలోనైనా రాణించవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. అందులో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. సర్వశిక్ష అభియాన్ సమకూర్చిన రెండు వీల్ ఛైర్లను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో భవిత సెంటర్ ఉపాధ్యాయులు మహాలక్ష్మి, ఎస్‌కె సలీమా ఉపాధ్యాయులు నజ్మా, రోజా, రమేష్, పద్మ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కామత్ హోటల్‌పై చర్యలు తీసుకోండి

- కలెక్టర్‌కు ఓ వినియోగదారుడి వినతిపత్రం

సిరిపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిల్వ ఆహారం విక్రయిస్తున్న బీచ్‌రోడ్డులోని కామత్ హోటల్‌పై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు మంగళవారం బసవ కృష్ణమూర్తి అనే వ్యక్తి వినతిపత్రం సమర్పించారు. ఫిర్యాదుదారుని కథనం ప్రకారం...సోమవారం సాయంత్రం కృష్ణమూర్తి లాసన్స్‌బే కాలనీ వద్ద గల కామత్ హోటల్‌కు వెళ్లి కౌజు పిట్ట మాంసం కొనుగోలు చేశారు. ఇరవై నిమిషాల తరువాత తినే ప్రయత్నం చేయగా కుళ్లిన వాసన రావడంతో ఫుడ్ సేఫ్టీ అధికారికి ఫోన్ చేశారు. తాను బయట ఉన్నానని ఇప్పుడు రాలేనని, తమ డిపార్టుమెంట్‌కు సిబ్బంది కొరత ఉందని మంగళవారం ఉదయం రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని అప్పుడు చర్యలు తీసుకుంటానని...మరీ అర్జంట్ అయితే తమ డిపార్టుమెంట్‌కు చెందిన వేరొకరికి ఫోన్ చేయాలని సూచించారు. ఆయనకు ఫోన్ చేయగా, అది తన పరిధిలోకి రాదని, కుళ్లిందని ల్యాబ్‌కు పంపినా ప్రూవ్ చేయలేమని సమాధానం ఇచ్చారు. ఈ నేపథ్యంలో నిల్వ ఉంచిన ఆహారాన్ని విక్రయిస్తున్న హోటళ్లపై చర్యలు తీసుకోవాలని, నిరంతరం అధికారులు పర్యవేక్షించే విధంగా చూడాలంటూ కలెక్టర్‌కు కృష్ణమూర్తి విజ్ఞాపన పత్రం అందజేశారు.

కాగ్నిజెంట్ ఫౌండేషన్ మెరిట్ స్కాలర్‌షిప్



ఏయూకు చెక్ అందిస్తున్న కాగ్నిజెంట్ ప్రతినిధులు

వెంకోజీపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఏయూ విద్యావిభాగంలో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ చదువుతున్న విద్యార్థులకు కాగ్నిజెంట్ ఫౌండేషన్ మెరిట్ స్కాలర్‌షిప్ అందజేసింది. మొత్తం పదిమంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.70 వేలు చొప్పున మొత్తం రూ.7 లక్షలు సహాయాన్ని అందజేసింది. కాగ్నిజెంట్ ఫౌండేషన్ ఒక్కో విద్యార్థికి రూ.70 వేలు వారి ఖాతాల్లో జమ చేసింది. ఈ సందర్భంగా స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థులను ఏయూ వీసీ జి.శశిభూషణ రావు మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి స్కాలర్‌షిప్‌ను అందిస్తున్న కాగ్నిజెంట్ ఫౌండేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని వీసీ సూచించారు. విభాగాధిపతి టి.షారోన్ రాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ విభాగంలోని విద్యార్థులకు కాగ్నిజెంట్ ఫౌండేషన్ ఆర్థిక సహకారాన్ని అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏయూ ఆలుమ్ని అసోసియేషన్ ఉపాధ్యక్షులుడాక్టర్ కుమార్‌రాజా, విద్యా విభాగం అధ్యాపకులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ మూర్తి, డాక్టర్ రాము తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్సీ చిరంజీవిని కలిసిన జీసీటీఏ ప్రతినిధులు

మద్దిలపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి హామీ ఇచ్చారు. విశాఖ జిల్లా ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ) నూతన కార్యవర్గం సభ్యులు మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చిరంజీవి మాట్లాడుతూ జీసీటీఏ నూతన కార్యవర్గం సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ అధ్యాపకులు ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటున్నా తన దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. తద్వారా సమస్యలను ప్రభుత్వంతో చర్చించి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీసీటీఏ అధ్యక్షుడు కర్రి రామారావు, ప్రధాన కార్యదర్శి మామిడి గోపి, కోశాధికారి ఎ.జ్యోతి, కార్యదర్శి కె.అరుణ పద్మ పాల్గొన్నారు.

సినీ గేయ రచయిత కులశేఖర్‌కు నివాళి



కులశేఖర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సభ్యులు

గోపాలపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మృతి చెందిన సినీగేయ రచయిత కులశేఖర్‌కు గోపాలపట్నం కళా సేవా పీఠం సభ్యులు మంగళవారం నివాళులర్పించారు. స్థానిక కళా సేవా పీఠం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కులశేఖర్ సంతాప కార్యక్రమంలో సేవా పీఠం సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సేవా పీఠం సభ్యులు పాల్గొన్నారు.

22న హైందవ శంఖారావం

గాజువాక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గాజువాక లంకా మైదానంలో ఈ నెల 22న హైందవ శంఖాకావం సభ నిర్వహించనున్నామని గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు తెలిపారు. హిందూ ధర్మం పరిరక్షణలో భాగంగా భారీ ఎత్తున సభ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. హిందూ ధర్మం పరిరక్షణకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని, సభకు గాజువాకలో ప్రజలు తమ కుటుంబ సభ్యులతో హాజరుకావాలని కోరారు.

కంబాలకొండలో బోటు షికారు హాయిహాయి

- ఖర్చు స్వల్పం... ఆహ్లాదం అధికం
- అందుబాటులో వివిధ రకాల పడవలు
- కార్తీక మాసం మినహా ఆదరణ అంతంతమాత్రమే



బోటు షికారుకు వెళుతున్న సందర్శకులు

ఆరిలోవ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగర సందర్శకులు పార్కులు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతారు. అలాంటి వారికి తూర్పు నియోజకవర్గం పరిధిలోని కంబాలకొండ చక్కని ఆహ్లాద ప్రదేశంగా చెప్పొచ్చు. ఇక్కడ డేగల కొండ రిజర్వాయర్‌లో బోటింగ్ చేయడానికి అవకాశం ఉంటుంది. ఎత్తయిన పచ్చని కొండలు, చుట్టు చక్కని వాతావరణం మధ్య ఇక్కడ బోటింగ్ చేయడానికి వీలుంటుంది.

ఇక్కడ మూడు రకాల పడవలు ఉంటాయి. వీటిలో కాయ్ కింగ్, ఫ్యామిలీ బోటు, తొట్టి బోటు అందుబాటులో ఉన్నాయి. ఒక్కొక్కరికి టికెట్ రూ.200. చిన్నారులకు రూ.100. ఈ సందర్భంగా బోటు నిర్వాహకులు మాట్లాడుతూ.. కార్తీక మాసంలో రోజుకు 200 వరకు సందర్శకుడు వస్తుంటారని చెప్పారు. డిసెంబరు నెలలో కూడా సందర్శకులు కొంత మేర వస్తుంటాయరని, ఆ తరువాత రోజుకు పదుల సంఖ్యలోనే సందర్శకులు పరిమితం అవుతారని తెలిపారు. సుమారు అన్ని రకాలు కలిపి 20 పడవల వరకు ఉన్నాయన్నారు. బోటు షికారుకు వెళ్లే వారికి ప్రత్యేక కోటులు ఇస్తామన్నారు. సందర్శకుల జాగ్రత్త కోసం అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు.



కంబాలకొండలో బోటు షికారుకు ఉపయోగిస్తున్న వివిధ రకాల పడవలు

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

- ఏయూ వీసీ శశిభూషణరావు
- రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభం



సావనీర్ ఆవిరిస్తుస్తున్న వీసీ శశిభూషణరావు, రిజిస్ట్రార్ ధనుంజయరావు తదితరులు

వెంకోజీపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులు అన్నిరంగాల్లో రాణించాలని ఏయూ ఉపకులపతి జి.శశిభూషణరావు ఆకాంక్షించారు. మంగళవారం ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం సమావేశ మందిరంలో ది సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'టువర్డ్స్ ఇంక్లూషన్ : ఎంపవరింగ్ పర్సన్స్ విత్ డిసేబులిటీస్ ఫర్ ఏ డెవలప్డ్ ఇండియా బై 2047" రెండు రోజుల జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ దివ్యాంగులకు అనుకూలంగా ఉండే విధంగా కార్యాలయాల నిర్మాణాలు జరగాలని సూచించారు. ఈ దిశగా ఏయూ కృషి చేస్తుందని చెప్పారు. అవకాశాలను అందిస్తే దివ్యాంగులు అవరోధాలను అధిగమిస్తారని చెప్పారు. ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు మాట్లాడుతూ వికసిత్ భారత్ సాకారం కావాలంటే దేశంలోని దివ్యాంగులు సైతం సాధారణ వ్యక్తులతో సమానంగా ప్రగతి సాధించే దిశగా ప్రోత్సహిస్తూ అవకాశాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం సంచాలకులు డాక్టర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకుని ఈ సదస్సును వర్తమాన అంశంపై నిర్వహించడం జరిగిందని తెలిపారు.

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (న్యూఢిల్లీ) జాయింట్ కార్యదర్శి డాక్టర్ ఆర్.మనోజ్‌కుమార్ కీలక ఉపన్యాసం ఇచ్చారు. సమ్మిళిత సమాజాన్ని నిర్మించడం విభిన్న ప్రతిభావంతులను భాగస్వాములను చేయడం ద్వారా మాత్రమే సాధ్యపడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. 2016లో అమల్లోకి వచ్చిన విభిన్న ప్రతిభావంతుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంగవైకల్యం కలిగిన వ్యక్తుల హక్కుల పరిరక్షణకు న్యాయస్థానాలు చేస్తున్న కృషిని ప్రశంసించారు. ప్రజా రవాణా వ్యవస్థ, మార్కెట్లు, రైల్వే స్టేషన్లు, ఎయిర్‌పోర్టు వంటి ప్రదేశాల్లో అంగవైకల్యం ఉన్న వారికి సైతం సులభంగా సంచరించే విధంగా పరిసరాలు ఉండాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. విశాఖపట్నం జోన్ 1 ప్రాంతీయ ఉపాధి అధికారి టి.అనిల్ కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులకు లభించే అవకాశాలను వివరించారు. తమ కార్యాలయం ద్వారా వీరిని ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గ్రూప్-1 అధికారిని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎ.రాణి తాను గ్రూప్-1 అధికారి కావడానికి చేసిన ప్రయత్నాన్ని, ప్రయాణాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ అంగవైకల్యం కలిగిన వ్యక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించే వేదికగా ఈ సదస్సు నిలుస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా అతిథులను సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు.

ఐడియాథాన్ నిర్వాహకులకు ఏయూ రిజిస్ట్రార్ అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న రిజిస్ట్రార్

వెంకోజీపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల ఐడియాథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎకో ఇనోవేటిక్స్ పేరుతో విద్యార్థులకు నిర్వహించిన ఈ పోటీల్లో ఏయూలో వివిధ భాగాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పర్యావరణహితంగా నిలిచే వివిధ సాంకేతికత, పరికరాలను అభివృద్ధి చేసేదిగా పనిచేశారు. దీంట్లో మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు, రెండవ స్థానంలో వారికి రూ.2500, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.1000 నగదు పురస్కారాన్ని, ప్రశంసా పత్రాన్ని అందించారు. నూతన ఆలోచనలను ప్రోత్సహించే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు ప్రత్యేకంగా అభిమానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఇందిర, కుసుమ అపర్ణ, ముదాసిర్, సబిహ తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తి ప్రత్యేకమైనది

- దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సిరిపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వైద్య వృత్తి ఎంతో ప్రత్యేకమైనదని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిపురం దత్ ఐల్యాండ్‌లోని ఇన్వోడెంట్ రెండో వార్షిక సదస్సు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ప్రతీ ఒక్కరికి దంతాలు ముఖ్యమన్నారు. దంతాల పరిరక్షణపై కలిపిస్తున్న అవగాహన సదస్సులు వినియోగించుకోవాలని సూచించారు. ఇన్వోడెంట్ ఫౌండర్ డాక్టర్ వెంకటమౌనిక మడిశ మాట్లాడుతూ ప్రత్యేకమైన శైలిలో దంత సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమన్నారు.ప్రతీ రోజు రెండు సార్లు దంతాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, ప్రజలు పాల్గొన్నారు.

షిప్‌బిల్డింగ్ డైరెక్టర్‌ను కలిసిన బీఎంఎస్ నాయకులు

మల్కాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : షిప్‌యార్డు షిప్ బిల్డింగ్ డైరెక్టర్ గంటి వెంకటేశ్వర్లును మంగళవారం ఉదయం బీఎంఎస్ నాయకులు ఆయన కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా షిప్‌యార్డులో సమస్యలను ఆయనకు వివరించారు. షిప్‌యార్డు మూతపడుతుందని అనుకొనే సమయంలో సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంస్థకు ఐదు ఫ్లీట్ సపోర్టు వెసెల్స్ ఆర్డర్‌ను తీసుకొని రావడం మనందరి అదృష్టంగా పేర్కొన్నారు. అందరం కలిసి సంస్థను కాపాడుకుంటామని వివరించారు. ఎల్‌అండ్‌ఎం సిరీస్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డైరెక్టర్‌ను కార్మిక నాయకులు కోరారు.

'పౌర గ్రంథాలయం అభివృద్ధికి సహకరిస్తా'


గ్రంథాలయంలో యువతతో సంభాషిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

సీతంపేట, డిసెంబరు 3: (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లోని విశాఖ పౌరగ్రంథాలయాన్ని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థులు, పోటీ పరీక్షలకు హాజరవుతున్న యువతతో మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న సేవలను గ్రంథాలయ సొసైటీ ప్రతినిధులు డీఎస్ వర్మ, టీఎస్ఆర్ ప్రసాద్‌లు ఎమ్మెల్యేకు తెలిపారు. గ్రంథాలయంలో పుస్తకాలు, కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధునికతతో పాఠకులు చదువుకోవడానికి ఈ గ్రంథాలయం ఎంతో ఉపయోగపడుతుందని, మరింత అభివృద్ధికి తన సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు గుండు సురేష్‌బాబు, చంటి, మాజీ కార్పొరేటర్ రాజు, శివప్రసాద్, నాగేశ్వరరావు, శ్రీనివాస్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అభిరుచికి తగ్గట్టుగా పుస్తక ప్రదర్శన


ప్రణవ్‌గోపాల్‌కు పుస్తకం అందజేస్తున్న నిర్వాహకులు

మహారాణిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): టర్నర్ చౌల్ట్రీలో ఏర్పాటు చేసిన విశాలాంధ్ర పుస్తక మహోత్సవాన్ని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎం.ప్రణవ్‌గోపాల్ మంగళవారం సందర్శించారు. పుస్తక ప్రదర్శన అన్ని వర్గాల ప్రజల అభిరుచికి తగ్గట్టుగా ఉందని, లాభాపేక్ష లేకుండా ఈ కార్యక్రమం నిర్వహించటం అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు. ఇలాంటి కార్యక్రమాలకు వీఎంఆర్‌డీఏ పూర్తిగా సహకరిస్తుందన్నారు.

'ఆసుపత్రి కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి'


కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో పనిచేసిన కార్మికులను తొలగించడం అన్యాయమని, వెంటనే వారిని విధుల్లోకి చేర్చుకోవాలని విశాఖ జిల్లా హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వై.రాజు డిమాండ్ చేశారు. అక్కయ్యపాలెంలోని కార్మిక శాఖ కార్యాలయం ఎదుట మంగళవారం కార్మికులు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ అవసరానికి మించి కార్మికులు ఉన్నారని చెబుతూనే యాజమాన్యం కొత్తగా 20 మంది కార్మికులను విధుల్లోకి చేర్చుకొని పాత కార్మికులు 38 మందిని ఉద్యోగాల నుంచి తొలగించడం చట్ట విరుద్ధమన్నారు. నిబంధనలు పాటిస్తున్నామని చెబుతూ సీనియర్ కార్మికులను తొలగించి జూనియర్లను కొనసాగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆసుపత్రి యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖాధికారులను కోరారు. ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

సిమెంటురోడ్లకు మోక్షం లేని మురళీనగర్


నరసింహనగర్‌లోని ఓ వీధిలో వాన నీరు నిలిచిన మట్టి రోడ్డు

మాధవధార, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో మాధవధార, మురళీనగర్ ప్రాంతాలు బయట ప్రపంచం దృష్టిలో కీలకమైనవి. ఇక్కడ అడుగిడితే దూరపు కొండలు నునుపు అన్న నానుడి గుర్తుకు వస్తుంది. నివాసయోగ్యం కాని వీధులు పదుల సంఖ్యలో కనిపిస్తాయి. ఈ కోవలోకి చెందుతుంది 51వవార్డు మాధవధార నరసింహనగర్. ఎత్తైన అపార్ట్‌మెంట్లకు అనుమతి లభిస్తున్న ఈ ప్రాంతంలో మట్టి రోడ్డే దిక్కు. అనధికార నిర్మాణాలకూ అనుమతి వచ్చేస్తున్నా... రోడ్డు నిర్మాణానికి జీవీఎంసీ ప్రాధాన్యం ఇవ్వలేకపోతోంది. వందలాది నివాసాలు, వేలమంది జనాభా ఉన్నారు. మూడు రోజులు ముసురుపడితే చాలు.. ఈ మట్టి రోడ్లలో రాకపోకలకు అవస్థలే. నాయకులుగా చలామణీ అవుతున్న ప్రజాప్రతినిధులూ స్పందించరు. రోడ్డు వేయకపోవడానికి కోర్టు కేసు కారణమని కార్పొరేటరు ఆర్.వెంకటరమణ చెబుతున్నారు. అయినా పక్కనే ఉన్న వీధిలో సిమెంటు రోడ్డు ఇటీవలే రూపుదిద్దుకుంది. తమకు పక్కా రహదారుల ఏర్పాటుకు అనుమతి విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులపై జీవీఎంసీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. గడిచిన అయిదేళ్లుగా ప్రతిపాదనల దశలోనే మిగిలిన రహదారి అంశాన్ని ఇప్పుడు కూటమి ప్రభుత్వం సాకారం చేయాలని కోరుతున్నారు. వర్షాల కారణంగా నాలుగు రోజులుగా ఈ ప్రాంత వాసులు అనేక అవస్థలు పడుతున్నారు. మాధవధార 51వ వార్డు పరిధిలోని సింహాచల గిరి ప్రదక్షిణ రోడ్డు కూడా మట్టి మార్గమే కావడం గమనార్హం!

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు శిక్షణ


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డా.నాగిరెడ్డి

కంచరపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యం మెరుగుపర్చుకోవడంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ఇంజినీరింగ్ విద్య నైపుణ్య సలహాదారు డాక్టరు నాగిరెడ్డి కొవ్వూరు పాల్గొని శిక్షణ ఇచ్చారు.'నీ గురించి నువ్వు తెలుసుకో' అన్న అంశంపై విద్యార్థులకు ప్రేరణ కల్పించారు. ఈ సందర్భంగా డాక్టరు నాగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులే భవిష్యత్ నిర్దేశకులని అన్నారు. చదువుతో పాటు తమ చుట్టూ ఉన్న పరిస్థితులను అవగాహన చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల పట్ల ప్రేమ, గౌరవం కలిగి ఉండడంతో పాటు ఆలోచనలు, విజ్ఞానం దేశ ప్రగతికి ఉపయోగపడేలా అభివృద్ధి చెందాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు మాట్లాడుతూ సత్ప్రవర్తన, క్రమశిక్షణతో కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవడం సులభమని సూచించారు. కార్యక్రమంలో సివిల్ హెడ్ రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులతో బుల్లయ్య కళాశాల ఉపాధ్యాయులు

సీతమ్మధార, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీ అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ చాంపియన్ పోటీల్లో బుల్లయ్య కళాశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ఫుట్‌బాల్ జట్టుకు నాయకత్వం వహించిన బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నవీన్‌కుమార్‌ను, జట్టు సభ్యులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీఎస్‌కె చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.శ్రీకాంత్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బీఆర్ఎస్ లక్ష్మణ్ రెడ్డి, గంగా భవాని విద్యార్థులను అభినందించారు.

ఉత్తమ సేవలందించిన రైల్వే సిబ్బందికి సత్కారం


ప్రమాదాన్ని నివారించిన ఉద్యోగికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వేలో విధుల నిర్వహణలో అంకితభావం, చిత్తశుద్ధి పాటించి ఉత్తమ సేవలందించిన సిబ్బందిగా గుర్తింపు పొందిన వారిని డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు మంగళవారం తన కార్యాలయంలో ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. లోకోమోటివ్ నుంచి వ్యాగన్ ఫ్రంట్ ఫాలోయర్ ప్లేట్ విరిగిపోయిందని గుర్తించి అప్రమత్తంగా వ్యవహరించిన క్యారేజ్ అండ్ వ్యాగన్స్ విభాగానికి చెందిన జి.రవికుమార్, జె.సంతోష్‌కుమార్, అలాగే బలుమస్కా సెక్షన్‌లో గూడ్స్ రైలు నుంచి పొగ రావడాన్ని గుర్తించి కంట్రోల్‌కు సమాచారమిచ్చి అప్రమత్తం చేసిన రైలు మేనేజర్ పవన్ సింగ్ మీనా, పార్వతీపురం స్టేషన్‌లో ప్రధాన ఓవర్ హెడ్ ఎక్యూప్‌మెంట్ బ్రేక్ డౌన్‌ను నివారించిన ట్రాక్ నిర్వాహకుడు ఆర్.రవీంద్ర సబన్, సింహాచలం రైల్వే స్టేషన్ సమీపంలో ఒక రైలుకు చెందిన కాయిల్ స్ప్రింగ్‌లలో ఒకటి సరిగా అమర్చలేదని గుర్తించి స్టేషన్ సూపరింటెండెంట్, చీఫ్ ట్రైన్ ఎగ్జామినర్‌కు సమాచారమిచ్చిన రైలు మేనేజర్ ఉదయ్ భాస్కర్ తదితరులను సన్మానించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు మాట్లాడుతూ విధుల నిర్వహణలో సిబ్బంది ప్రదర్శించే చిత్తశుద్ధి, నిబద్ధత ప్రయాణికులకు భద్రతను కల్పించడమే కాకుండా రైల్వే ఆస్తులను కాపాడుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఇ.శాంతారామ్, సీనియర్ డివిజనల్ అధికారి సిద్ధార్థ ప్రధాన్ స్థానిక కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి విశిష్ట పూజలు


కనకమహాలక్ష్మి అమ్మవారికి అష్టదళ పద్మారాధన, 108 స్వర్ణ పుష్పాలతో అలంకరణ

జగదాంబ కూడలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం విశిష్ట పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి శ్రీ చక్రనవర్నార్చన, లక్ష్మీహోమం, వేదపారాయణం, సప్తశతీ పారాయణ, మహావిద్యాపారాయణ, పూర్ణాహుతి సేవలను ఆలయ పండితులు భక్తితో జరిపారు. అమ్మవారి ప్రత్యేక పూజల్లో భాగంగా శ్రీ చక్రపీఠం వద్ద లక్ష కుంకుమార్చనను వేదపండితులు, అర్చకులు నిర్వహించారు అదేవిధంగా ప్రతీ వారం నిర్వహించే అష్టదళ పద్మారాధన, 108 స్వర్ణ పుష్పాలతో అలంకరణ వంటి విశిష్ట పూజలను ఉభయదాతల చేత అర్చకులు జరిపించారు. ఈ పూజల్లో ఆలయ కార్యనిర్వహణాధికారిణి కె.శోభారాణి, అధికారులు పాల్గొన్నారు. శ్రీ జగన్నాథస్వామి ఆలయం వద్ద ఉచిత అన్న ప్రసాద వితరణకు భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. వెయ్యి మంది భక్తులకు ఆలయ అధికారులు అన్న సంతర్పణ చేశారు.

ప్రయాణికుల నిరీక్షణ ఒకచోట బస్సులు ఆగేది మరోచోట

కంచరపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ఊర్వశి జాతీయ రహదారిలో బస్ షెల్టర్ ఒక దగ్గర, బస్సులు ఆగేది మరోచోట కావడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఇక్కడ బస్టాప్‌కు సమీపంలో రెండు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, ప్రభుత్వ ఐటీఐలు ఉండడంతో నిత్యం వేలాది మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే బస్ షెల్టర్‌ను బస్సులు ఆగే ప్రాంతానికి దూరంగా నిర్మించడంతో ప్రయాణికులు జాతీయ రహదారి ఫుట్‌పాత్ వద్దనే నిరీక్షిస్తుంటారు. అయితే బస్సులు సకాలంలో రాకపోవడంతో విద్యార్థులు ఎక్కువసేపు నిల్చోలేక ఫుట్‌పాత్‌ల మీదే కూర్చొని ఉండడం దయనీయంగా కనిపిస్తుంది. అయితే సమీపంలో ఇటీవల రూ.లక్షలు ఖర్చు చేసి షెల్టర్‌ను నిర్మించినా బస్సులు నిలుపు స్థలానికి ఆమడ దూరంలో ఉండటం వలన నిరుపయోగంగా మారింది. ఇక్కడ బస్సుల కోసం వేచి ఉండేవారితో ఉదయం, సాయంత్రం చాలా రద్దీగా ఉంటుంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలి


దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్


ఎన్‌జీజీఓస్ కాలనీలో మాట్లాడుతున్న ఎంఈవో రామారావు


కొండగుడి వద్ద కొవ్వొత్తుల తయారీపై అవగాహన కల్పిస్తున్న శ్రీలక్ష్మి

డాబాగార్డెన్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తే సమాజంలో ఉన్నతంగా రాణించేందుకు అవకాశాలు ఉంటాయని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్ డ్వాక్రాబజార్‌లోని 'ది ఎబిలిటీ పీపుల్' ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే అక్కడివారితో ముచ్చటించారు. కృత్రిమ అవయవాలను ఉపయోగించే విధానాన్ని తెలుసుకున్నారు. దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తే గొప్పస్థాయికి చేరుకోవచ్చన్నారు. విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి తనవంతు సంపూర్ణంగా సహాయసహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమ నిర్వాహక సంస్థ డైరెక్టర్ దిలీప్ పాత్రో మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పడాల విజయశంకర్, కూటమి నాయకులు పాల్గొన్నారు. పలువురికి ఉచితంగా వీల్‌చైర్లు, కృత్రిమ అవయవాలను అందజేశారు.

దివ్యాంగుల ప్రోత్సాహానికి అందరూ ముందుకు రావాలి

అక్కయ్యపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు అందరూ ముందుకు రావాలని 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి పిలుపునిచ్చారు. ఎన్‌జీజీఓస్ కాలనీలోని భవిత కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రావణి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులను విజేతలుగా నిలబెట్టాలన్నారు. సీతమ్మధార ఎంఈవోలు రామారావు, బాలామణి మాట్లాడుతూ వారి భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ ఆటల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పద్మజ, ఉపాధ్యాయులు ఎ.సునంద్, ఎన్‌వీ విశ్వనాథం, నిర్మల, భవిత కేంద్రం ఉపాధ్యాయులు జగదాంబ, శారద తదితరులు పాల్గొన్నారు.

స్వయంశక్తితో ఎదగాలి

జగదాంబ కూడలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు సమాజంలో స్వయంశక్తితో ఎదగాలని వేదాంత, విజిసిబి పోర్టు సిఎస్ఆర్ హెడ్, పిఆర్‌ఓ శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పాతపోస్టాఫీసు కొండగుడి వద్ద దివ్యాంగులకు కొవ్వొత్తుల తయారీలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులు ఇలాంటి శిక్షణ తరగతుల ద్వారా నైపుణ్యం సాధించి, స్వతంత్రంగా సమాజంలో బతకాలన్నారు. ఈ కేంద్రంలో కొవ్వొత్తుల తయారీలో శిక్షణ పొందిన వారికి పరిశ్రమకు కావలసిన పరికరాలు ఉచితంగా అందజేస్తామన్నారు. ముడి సరుకు కూడా సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొండగుడి ఫాదర్ జోసెఫ్, అప్రోచ్ ప్రాజెక్టు మేనేజర్ కె.విజయభాస్కర్, కో-ఆర్డినేటర్ వై.అశోక్ కుమార్, కమ్యూనిటీ మొబిలైజర్స్ అనిల్, ఆశ, సాయి, 30 మంది దివ్యాంగులు శిక్షణలో పాల్గొన్నారు.

విశాఖ టు కాకినాడ.. వయా చోడవరం

... 5వ పేజీ తరువాయి

కలాసీగా పనిచేసిన ఒక వ్యక్తి ఇప్పుడు కోట్లు సంపాదించారని ఆ ప్రాంతంలో డీలర్లు చెబుతుంటారు.

గాజువాక, షీలానగర్, గోపాలపట్నం, పెందుర్తి, మధురవాడ ప్రాంతాల నుంచి ఆనందపురం, పెందుర్తి మీదుగా చోడవరం ప్రాంతానికి భారీగా రేషన్ బియ్యం తరలిపోతున్నాయి. కొందరు ఆనందపురం పరిసరాల్లో మిల్లులకు అమ్ముతున్నారు. ఇటీవల విజయనగరం జిల్లాలో మిల్లులకు విక్రయిస్తున్నారు. చోడవరం ప్రాంతానికి వెళ్లే రేషన్ బియ్యానికి కొంత పాలిష్ పెట్టి కాకినాడ తరలిస్తున్నారు. ఒక్కొక్కసారి వచ్చిన బియ్యం వచ్చినట్టే కాకినాడకు పంపుతుంటారు. ఈ వ్యవహారంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఒకరు స్వయంగా ఫిర్యాదు చేశారు.

గంగవరం పోర్టులో తనిఖీలు

కాకినాడ పోర్టు నుంచి ఆఫ్రికా దేశాలకు రేషన్ బియ్యం ఎగుమతి చేసే నౌకను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పట్టుకున్న నేపథ్యంలో అన్ని జిల్లాల్లో రేషన్ బియ్యం అక్రమాల గుట్టు తేల్చాలని ప్రభుత్వం ఆదేశించింది. విశాఖలో జేసీ మయూర్ అశోక్ కొద్దిరోజులుగా రేషన్ బియ్యం వ్యాపారంపై నిఘా పెట్టారు. ఆయన ఆదేశాల మేరకు పౌర సరఫరాల శాఖ అడపా దడపా దాడులు చేస్తుంది. తాజాగా కాకినాడ వ్యవహారంతో పౌర సరఫరాల గాజువాక ఏఎస్‌వో సోమవారం సాయంత్రం గంగవరం పోర్టును తనిఖీ చేశారు. గంగవరం పోర్టు నుంచి బియ్యం ఎగుమతులు లేవని నిర్ధారించారు. విశాఖ పోర్టు నుంచి బియ్యం ఎగుమతులను తనిఖీ చేయాలని నిర్ణయించారు. ఇందుకు జిల్లా యంత్రాంగం ద్వారా పోర్టు అనుమతి తీసుకోవాల్సి ఉంది. సోమవారం రాత్రి మల్కాపురం ప్రాంతంలోని క్రాంతినగర్, గాజువాక వుడా కాలనీల్లో రెండు ఇళ్లపై జిల్లా పౌర సరఫరాల అధికారి భాస్కరరావు దాడి చేసి 40 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. కాగా నగరంలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసే ఇళ్లు, దుకాణాలపై దాడులు కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

అక్రమార్కులపై డ్రోన్ ప్రయోగం

... 5వ పేజీ తరువాయి

ఏర్పడుతుంటాయి. అక్రమ నిర్మాణదారుల వద్ద టౌన్‌ప్లానింగ్ విభాగంలోని కొందరు అధికారులు, సిబ్బందితోపాటు కార్పొరేటర్లు, మీడియా పేరుతో మరికొందరు బెదిరింపులకు దిగడం, బలవంతపు వసూళ్లకు పాల్పడుతుంటారు. నిర్మాణదారుడు డబ్బులు ఇవ్వకపోతే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (స్పందన)లో ఫిర్యాదు చేస్తుంటారు. స్పందనకు వచ్చే ఫిర్యాదుల్లో అత్యధికం టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించినవి...అందులోనూ అక్రమ నిర్మాణాలకు సంబంధించినవే అధికంగా ఉంటున్నాయి. అదే విషయాన్ని ఇటీవల మీడియా సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో నగరంలో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడంపై కమిషనర్ దృష్టిసారించారు.

డ్రోన్‌తో అక్రమ నిర్మాణాలు గుర్తింపు

నగరంలో అక్రమ నిర్మాణాలను గుర్తించేందుకు వీలుగా 'డ్రోన్' తో సర్వే చేయాలని నిర్ణయించినట్టు కమిషనర్ తెలిపారు. నగరం అంతా ఒకేసారి కాకుండా పైలట్ ప్రాజెక్టు కింద ఏదో ఒక జోన్‌ను ఎంపిక చేయాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఆటోకాడ్‌తో సర్వే చేసి నివేదిక తయారుచేసిన తర్వాతే ప్లాన్ జారీచేస్తారు కాబట్టి, ఆ సమాచారాన్ని ప్రస్తుత స్థితి తెలిపే జీఐఎస్ (జియోగ్రఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్)తో అనుసంధానం చేసి డ్రోన్‌కు సాఫ్ట్‌వేర్‌ను అప్‌లోడ్ చేస్తామన్నారు. డ్రోన్ సర్వే చేసి ఆ రెండు నివేదికల ఆధారంగా భవన నిర్మాణాల్లో జరిగిన ఉల్లంఘనలు, ఏ స్థాయిలో జరిగాయనేది తెలియజేస్తుంది. వీటిని క్రోడీకరించిన తర్వాత అక్రమ నిర్మాణం స్థాయిని బట్టి చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో నిర్మించే భవనాలపై ప్రభుత్వానికి నివేదించి, అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు ముందుకు వెళతారు. ఇక అదనపు అంతస్తులు నిర్మించినా, సెట్‌బ్యాక్‌ల ఉల్లంఘనలు జరిగినా పది శాతంలోపు అయితే ఒక రకంగా, 25 శాతం వరకూ మరో రకమైన జరిమానా, అంతకంటే ఎక్కువ ఉల్లంఘన ఉంటే మరోలా చర్యలు తీసుకునే ఆలోచన ఉందని కమిషనర్ తెలిపారు. అన్నీ అనుకూలిస్తే ఈ నెలలలోనే పైలట్ ప్రాజెక్టు కింద డ్రోన్ సర్వే జరపాలని టౌన్‌ప్లానింగ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఫార్మా కంపెనీల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

యాజమాన్యాలకు అలుసుగా మారినట్టు ప్రచారం జరుగుతోంది.

ఠాగూర్ యాజమాన్యం యూనిట్-3లో 17 రకాల మందుల తయారీకి ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుంది. అందులో లామివుడీన్ లేదు. కానీ ఉత్పత్తి చేస్తున్నారు. మొదటి బ్యాచ్ మందు తయారు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ఇలా అనుమతులు లేకుండా అత్యంత కీలకమైన మందులు తయారుచేయవచ్చునా?, ఇలాంటి అంశాలను అధికారులు తనిఖీల ద్వారా గుర్తించి చర్యలు చేపట్టరా?...అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పెట్టుబడులు, ఉపాధి అనే అంశాల ఆధారంగా ఫార్మా కంపెనీలు ఏమి చేస్తున్నా పాలకులు పెద్దగా స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ వరుస ప్రమాదాలపై హై లెవెల్ కమిటీ విచారణ జరుగుతున్న సమయంలోనే అవే మళ్లీ పునరావృతం కావడం మరో విశేషం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందిస్తుందా? కఠిన చర్యలు తీసుకుంటుందా?...అనేది చూడాలి. ఇలాంటి అనుమతి లేని ఉత్పత్తులు ఇంకా ఎక్కడెక్కడ జరుగుతున్నాయో గుర్తించి, తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

స్కిల్ హబ్‌లలో నిరుద్యోగులకు శిక్షణ

... 5వ పేజీ తరువాయి

కళాశాలలో కోర్సు ఆన్ కంప్యూటర్ కాన్సెప్ట్ (9121676360), డాక్టర్ వీఎస్ కృష్ణ డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో ఆఫీస్ అసిస్టెంట్ (9885694676), గాజువాకలోని నాక్ శిక్షణ కేంద్రంలో అసిస్టెంట్ ప్లంబర్ జనరల్ (9493837994), నగర పరిధిలోని నాక్ శిక్షణ కేంద్రంలో గల స్కిల్ హబ్‌లో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సు (9676170026)లో శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు వెల్లడించారు. ఆయా కోర్సుల్లో చేరాలనుకునే అభ్యర్థులు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ నెల నాలుగో తేదీ (గురువారం) వరకూ రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందని వివరించారు. నాన్ రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం అభ్యర్థులకు సర్టిఫికెట్‌తోపాటు అసెస్‌మెంట్ టెస్ట్ నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. స్వయం ఉపాధి పొందేలా యూనిట్లు పెట్టుకుంటామనుకునే వారికి అవసరమైన సహకారాన్ని అందిస్తామని తెలిపారు.

కళాసాహితి కార్యదర్శి సన్యాసిరాజు మృతి

శబరిమలై యాత్రలో గుండెపోటుతో దుర్మరణం


సన్యాసిరాజు (ఫైల్)

భీమునిపట్నం డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భీమిలి కళాసాహితి ప్రధాన కార్యదర్శిగా ఉన్న అడిదం సన్యాసిరాజు శబరిమలై యాత్రకు వెళ్లి మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఈ సమాచారాన్ని అక్కడి నుంచి భీమిలి వాసులకు చేరడంతో భీమిలిలో విషాద వాతావరణం నెలకొంది. గత కొన్ని సంవత్సరాలుగా గాయకుడిగా, కళాకారుడిగా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. ఆయనకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత ఆదివారం భీమిలిలో జరిగిన రచయితల సమావేశంలో చురుగ్గా వ్యవహరించిన ఈయన మృతికి కళాసాహితి అత్యవసర సమావేశం సంతాపాన్ని తెలియజేసింది. హిందూ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు షైలపల్లి షణ్ముఖరావు అయ్యప్ప సేవా పీఠం సభ్యులు సంతాపాన్ని తెలియజేశారు.

కొట్టి పడేసిన చెట్ల కొమ్మలు రోడ్లపైనేనా?


ఉడాకాలనీ బస్టాపు వద్ద కమ్యూనిటీ హాలు దగ్గర చెట్ల వ్యర్థాలు

మురళీనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఆ శాఖ సిబ్బంది, పరిసరాల పరిశుభ్రత పేరిట జీవీఎంసీ వారు తరచూ చెట్ల కొమ్మలు నరికేస్తుంటారు. గ్రేటరు 51వ వార్డు మాధవధార ఉడాకాలనీ ప్రాంతంలోని రోడ్లలో ఎక్కడ చూసినా, కొట్టి పడేసిన చెట్ల వ్యర్థాలే కనిపిస్తున్నాయి. కరెంటు తీగెల నిర్వహణ కోసం కొట్టేసినవి కొన్నయితే, కాలనీ సంక్షేమ సంఘాలు వీధుల శుభ్రత పేరిట నరికించిన కొమ్మలు కొన్ని ఉంటున్నాయి. పనులు ముగిశాక, చెట్ల వ్యర్థాలు రోడ్లపైనే పడేస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పారిశుధ్య సిబ్బంది, ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది, కాలనీ సంక్షేమ సంఘాలు గానీ పట్టించుకోవడం లేదు. దీంతో ప్రధాన రహదారుల నుంచి వీధి రోడ్ల వరకు ఎండిన చెట్ల కొమ్మలు, పెద్ద పెద్ద చెట్ల కలప రోడ్లకు అడ్డంగా పేరుకుంటోంది. వీటి చుట్టూ స్థానికులు పారబోసే చెత్త పోగులు పరిస్థితులను మరింత దుర్భరంగా మారుస్తున్నాయి. అధికారులు దృష్టి సారించి ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈపీడీసీఎల్, జీవీఎంసీ విభాగాల సమన్వయంతో పాటు కాలనీ సంఘాలు మాధవధార ఉడాకాలనీలో ఎక్కువగా ఉండే చెట్ల నిర్వహణ తీరుపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

సంక్షిప్తంగా..

అప్పన్న ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు

సింహాచలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసాన్ని పురస్కరించుకుని సింహాద్రినాథుని సన్నిధిలో వైదిక ఉత్సవాలు జరగనున్నాయి. అన్ని గురువారాలు, 29 ఆదివారాల్లో ఉదయం 7.30గంటలకు ఆర్జిత స్వర్ణ పుష్పార్చనలు జరుగుతాయి. సింహవల్లీ తాయార్ సన్నిధిలో ప్రతి శుక్రవారం ఉదయం 7.30 గంటలకు సహస్ర కుంకుమార్చన, సాయంత్రం 5 గంటలకు తిరువీధి ఉత్సవాలు ఉంటాయి. ఈనెల 6 శ్రవణం నక్షత్రం పురస్కరించుకుని కొండదిగువ పద్మావతి, అలిమేలుమంగా సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సుదర్శన హోమం, 9న అప్పన్న సన్నిధిలో తిరుమంగైళ్వార్ తిరునక్షత్ర ఉత్సవాలు ఆరంభమవుతాయి. 11న మార్గశిర మాస శుక్లపక్ష ఏకాదశి అప్పన్నస్వామికి స్వర్ణ తులసి దళార్చన, గీతాజయంతి, సాయంత్రం తిరువీధి, 12న ద్వాత్రింశతి (32రోజుల) నృసింహ దీక్షల ప్రారంభం, 13న తిరుమంగైళ్వార్ తిరునక్షత్ర చాత్తు, 14నమాస జయంతి, తిరుప్పాణాళ్వార్ తిరునక్షత్రం, తిరువీధి, మాధవధారలోని మాధవస్వామి ఆలయంలో అష్టాక్షరీ హవనం, 15న వృశ్చిక పూర్ణిమ, వృశ్చిక దీపారాధన, ప్రబంధనిగమం, చొక్కప్పం తిరుక్కార్తి ప్రారంభం, రాత్రి ధూప సేవాంతర తిరువీధి, 16న ఉదయం 6.35 గంటలకు నెలగంట తో ధనుర్మాసోత్సవాలు ప్రారంభం, 17న పునర్వసు నక్షత్రం గంగధార సీతారామస్వామి ఆలయంలో అష్టాక్షరీ మంత్రపూర్వక సంక్షిప్త రామాయణ హవనం, 21న ఆండాళ్ అమ్మవారి మాస తిరునక్షత్రం, 26 స్వాతి నక్షత్ర హవనం, 30న గ్రామ బలి హరణం, 31 నుంచి పగల్‌పత్తు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

ఉక్కు పరిరక్షణకు ఐద్వా పోస్టుకార్డు ఉద్యమం

కూర్మన్నపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌సిటీ జోన్ ఐద్వా కమిటీ మహిళలు పోస్టుకార్డు ఉద్యమంలో భాగంగా మంగళవారం 86వ వార్డు ద్వారకాపురి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పోస్టుకార్డులు పంపిణీ చేసి ప్రజల మద్దతు కోరారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సత్యవతి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని విరమించుకోవాలని, తక్షణమే సంస్థ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు కె.విమల, కె.వేణు, వర లక్ష్మి, సుభాషిణి, ప్రభ, సుమలత, పద్మావతి, శాంతి పాల్గొన్నారు.

రికవరీ సొమ్ము చెల్లించాలి

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల నుంచి రికవరీ చేసిన పీఎఫ్, ఎస్‌బీఎఫ్ సొమ్మును ఆయా ట్రస్టులకు వెంటనే చెల్లించాలని స్టీల్ ఇంటక్ నాయకులు పే సెక్షన్ డీజీఎం రామ్ ప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం సమస్యలపై ఆయనతో చర్చించారు. నాయకులు మంత్రి రాజశేఖర్, పీవీ నగేష్, ప్రభాకర్ రెడ్డి, గోపాలరాజు, దేముడు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **మెకానిక్ రాఖీ:** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

● **దేవకీనందన వాసుదేవ:** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **జీబ్రా:** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)

● **కంగువా:** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)

● **లక్కీ భాస్కర్:** వెంకటేశ్వర

● **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 46, వంకాయలు (తెలుపు)28, వంకాయలు (నలుపు) 34, బెండకాయలు 18, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 30, క్యారెట్ 58 దొండకాయలు 32, బంగాళదుంపలు 37, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 28 దోస కాయలు 26, వె ల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 50, కీరదోస 28, కాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడ దుంపలు 38, కంద 58, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 50, కరివేపాకు (కిలో) 55, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	92
ఫారం ధర	112
విత్ స్కిన్	194
స్కిన్‌లెస్	204

చెత్త తరలింపుపై నిర్లక్ష్యం

» చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం పక్కన పేరుకుపోయిన చెత్త

» ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ స్థానికుల ఆరోపణ



సాయిబాబా ఆలయం వద్ద డంపింగ్ యార్డును తలపిస్తున్న చెత్తకుప్పలు

ఆరిలోవ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం గోడకు ఆనుకొని చెత్తలు వేస్తుండడంతో ఆ ప్రాంతం డంపింగ్‌యార్డులా తయారైంది. దీన్ని చూసిన ఎవరైనా ఇది డంపింగ్ యార్డు అనుకుంటే అతిశయోక్తి కాదు. ఇక్కడ ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ సక్రమంగా చేపట్టకపోవడం, డంపింగ్ యార్డు లేకపోవడంతో స్థానికులు కొందరు ఆల యం సమీపంలో చెత్తాచెదారాలను పారవేస్తున్నారు.

ఈ చెత్త బాగా కుళ్లిపోయి దుర్వాసన వెలువడుతోంది. దీంతో స్థానికులతో పాటు ఇక్కడ ఉంటున్న అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములు ఇబ్బంది పడుతున్నారు. ముక్కు మూసుకుంటే గాని ఇటు వైపు నుంచి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. చెత్త కారణంగా దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో దోమల కుట్టి ఏ వ్యాధులు సోకుతాయోనని ఆందోళన చెందుతున్నారు.

ఎప్పటి నుంచో ఈ సమస్య ఉన్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేశామని, అయినప్పటికీ పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి చెత్త తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సచివాలయం ఎదుట చిరు వ్యాపారుల ఆందోళన

» తోపుడు బండ్లు ఎత్తుకెళ్లడంతో నిరసన

» తాము తేలేదని సచివాలయ సిబ్బంది బుకాయింపు

» సీసీ టీవీ పుటేజీలు చూపించడంతో కంగుతిన్న సిబ్బంది



టీడీపీ నేత బొట్టా వెంకటమరణతో గోడు వెళ్లబోసుకుంటున్న తోపుడు బండ్ల వ్యాపారులు

మద్దిలపాలెం, డిసెంబరు 3 : పిఠాపురం కాలనీ రోడ్డులో రిపేర్లు చేసుకుంటున్న తోపుడు బండ్లు మాయమయ్యాయి. మంగళవారం ఉదయం చినుకులు పడుతున్నాయని ఇంటికి వెళ్లివచ్చేసరికి తమ బండ్లు కనిపించకపోవడంతో దుకాణదారులు అవాక్కయ్యారు. అయితే సచివాలయం సిబ్బంది తరలించుకు పోయారన్న విషయం తెలుసుకుని కళాభారతి సమీపంలో సచివాలయం వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు.

అదే సమయంలో సచివాలయానికి వచ్చిన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్‌ను చుట్టిముట్టారు. తాము వ్యాపారాలు చేయడం లేదని, ధ్వంసం చేసిన తోపుడు బండ్లకు మరమ్మతులు చేసుకుంటుంటే ఎందుకు ఎత్తుకెళ్లారని నిలదీశారు. ఇప్పటికే ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. పూట గడవక కడుపుమాడ్చుకునిఉంటున్నామని బావురుమన్నారు.

అయితే తాము తోపుడు బండ్లను తొలగించలేదని సచివాలయ కార్యదర్శులు చెప్పుకొచ్చారు. దీంతో చిరువ్యాపారులు ఎదురుగా ఉన్న భవనంలోని సీసీ టీవీ పుటేజీ తీసుకొచ్చి వారికి చూపించారు. టౌన్‌ప్లానింగ్ కార్యదర్శి జ్యోతి, శానిటేషన్ సూపర్‌వైజర్ గురువులు, సిబ్బంది.. రిపేర్లు చేస్తున్న తోపుడుబండ్లను తరలిస్తున్న దృశ్యాలు పుటేజీలో చూపించారు.

దీంతో ఏం చెప్పాలో తెలియని సచివాలయ సిబ్బంది.. తామే తోపుడుబండ్లను ఇక్కడకు తెప్పించామని అంగీకరించామని,ఇక్కడకు సమీపంలోనే ఉంచామని చెప్పారు. వీధి వ్యాపారులు అక్కడకి వెళ్లి చూడగా, ఆ బండలో ఉన్న వంటసామగ్రి కనిపించలేదు. దీంతో మళ్లీ సచివాలయ సిబ్బందిని నిలదీశారు. ఇదేం పనంటూ ఆందోళనకు దిగారు.

ఇంతలో టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ అక్కడకు చేరుకొని ఆందోళన చేస్తున్న చిరువ్యాపారులకు నచ్చజెప్పారు. వచ్చే సోమవారం నాటికి కళాభారతి రోడ్డులో ఎవరికి ఇబ్బంది లేకుండా మార్జిన్లు వేసి వ్యాపారాలకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం నిరాశ్రయులకు ఉపాధి కల్పిస్తుంది తప్ప ఎవరికీ అన్యాయం చేయదన్నారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా ఎవరు నడుచుకున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు సహించరని తెలిపారు. హైకోర్టు ఆదేశం ప్రకారం రోడ్డు మార్జిన్లు వేయించి అందులోనే వ్యాపారాలు చేసుకునేలా కృషి చేస్తానన్నారు. చిరువ్యాపారులకు ఉపాధి కల్పించే ఈ కార్యక్రమానికి ఎవరైనా అడ్డుతగిలితే ఇక్కడే దీక్ష చేద్దామని వీధివ్యాపారులకు చెప్పారు. వంటసామాగ్రి చోరికి గురైతే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.



విద్యార్థులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న చినగదిలి ఎంఈవో అనూరాధ

దివ్యాంగుల ప్రతిభ ఎవరికీ తీసిపోదు

» చినగదిలి ఎంఈవో అనూరాధ

ఆరిలోవ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను ప్రత్యేక అవసరాల విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని చినగదిలి మండల విద్యాశాఖాధికారి-2 పి.అనూరాధ పేర్కొన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం చినగదిలి మండలంలోని తోటగరువు ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల ప్రతిభ ఎవరికీ తీసిపోదన్నారు. కష్టపడితే ఏ రంగంలోనైనా రాణించవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. అందులో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. సర్వశిక్ష అభియాన్ సమకూర్చిన రెండు వీల్ చైర్లను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో భవిత సెంటర్ ఉపాధ్యాయులు మహాలక్ష్మి, ఎస్‌కె సలీమా ఉపాధ్యాయులు నజ్మా, రోజా, రమేష్, పద్మ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కామత్ హోటల్‌పై చర్యలు తీసుకోండి

» కలెక్టర్‌కు ఓ వినియోగదారుడి వినతిపత్రం

సిరిపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిల్వ ఆహారం విక్రయిస్తున్న బీచ్‌రోడ్డులోని కామత్ హోటల్‌పై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు మంగళవారం బసవ కృష్ణమూర్తి అనే వ్యక్తి వినతిపత్రం సమర్పించారు. ఫిర్యాదుదారుని కథనం ప్రకారం...సోమవారం సాయంత్రం కృష్ణమూర్తి లాసన్స్‌బే కాలనీ వద్ద గల కామత్ హోటల్‌కు వెళ్లి కౌజు పిట్ట మాంసం కొనుగోలు చేశారు. ఇరవై నిమిషాల తరువాత తినే ప్రయత్నం చేయగా కుళ్లిన వాసన రావడంతో ఫుడ్ సేఫ్టీ అధికారికి ఫోన్ చేశారు. తాను బయట ఉన్నానని ఇప్పుడు రాలేనని, తమ డిపార్టుమెంట్‌కు సిబ్బంది కొరత ఉందని మంగళవారం ఉదయం రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని అప్పుడు చర్యలు తీసుకుంటానని...మరీ అర్జంట్ అయితే తమ డిపార్టుమెంట్‌కు చెందిన వేరొకరికి ఫోన్ చేయాలని సూచించారు. ఆయనకు ఫోన్ చేయగా, అది తన పరిధిలోకి రాదని, కుళ్లిందని ల్యాబ్‌కు పంపినా ప్రూవ్ చేయలేమని సమాధానం ఇచ్చారు. ఈ నేపథ్యంలో నిల్వ ఉంచిన ఆహారాన్ని విక్రయిస్తున్న హోటళ్లపై చర్యలు తీసుకోవాలని, నిరంతరం అధికారులు పర్యవేక్షించే విధంగా చూడాలంటూ కలెక్టర్‌కు కృష్ణమూర్తి విజ్ఞాపన పత్రం అందజేశారు.

సినీ గేయ రచయిత కులశేఖర్‌కు నివాళి



కులశేఖర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సభ్యులు

గోపాలపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మృతి చెందిన సినీగేయ రచయిత కులశేఖర్‌కు గోపాలపట్నం కళా సేవా పీఠం సభ్యులు మంగళవారం నివాళులర్పించారు. స్థానిక కళా సేవా పీఠం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కులశేఖర్ సంతాప కార్యక్రమంలో సేవా పీఠం సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సేవా పీఠం సభ్యులు పాల్గొన్నారు.

22న హైందవ శంఖారావం

గాజువాక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గాజువాక లంకా మైదానంలో ఈ నెల 22న హైందవ శంఖాకావం సభ నిర్వహించనున్నామని గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు తెలిపారు. హిందూ ధర్మం పరిరక్షణలో భాగంగా భారీ ఎత్తున సభ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. హిందూ ధర్మం పరిరక్షణకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని, సభకు గాజువాకలో ప్రజలు తమ కుటుంబ సభ్యులతో హాజరుకావాలని కోరారు.

కాగ్నిజెంట్ ఫౌండేషన్ మెరిట్ స్కాలర్‌షిప్



ఏయూకు చెక్ అందిస్తున్న కాగ్నిజెంట్ ప్రతినిధులు

వెంకోజీపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఏయూ విద్యావిభాగంలో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ చదువుతున్న విద్యార్థులకు కాగ్నిజెంట్ ఫౌండేషన్ మెరిట్ స్కాలర్‌షిప్ అందజేసింది. మొత్తం పదిమంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.70 వేలు చొప్పున మొత్తం రూ.7 లక్షలు సహాయాన్ని అందజేసింది. కాగ్నిజెంట్ ఫౌండేషన్ ఒక్కో విద్యార్థికి రూ.70 వేలు వారి ఖాతాల్లో జమ చేసింది. ఈ సందర్భంగా స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థులను ఏయూ వీసీ జి.శశిభూషణరావు మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి స్కాలర్‌షిప్‌ను అందిస్తున్న కాగ్నిజెంట్ ఫౌండేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని వీసీ సూచించారు. విభాగాధిపతి టి.షారోన్ రాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ విభాగంలోని విద్యార్థులకు కాగ్నిజెంట్ ఫౌండేషన్ ఆర్థిక సహకారాన్ని అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏయూ ఆలుమ్ని అసోసియేషన్ ఉపాధ్యక్షులుడాక్టర్ కుమార్‌రాజా, విద్యా విభాగం అధ్యాపకులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ మూర్తి, డాక్టర్ రాము తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్సీ చిరంజీవిని కలిసిన జీసీటీఏ ప్రతినిధులు

మద్దిలపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి హామీ ఇచ్చారు. విశాఖ జిల్లా ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ) నూతన కార్యవర్గం సభ్యులు మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చిరంజీవి మాట్లాడుతూ జీసీటీఏ నూతన కార్యవర్గం సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ అధ్యాపకులు ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటున్నా తన దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. తద్వారా సమస్యలను ప్రభుత్వంతో చర్చించి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీసీటీఏ అధ్యక్షుడు కర్రి రామారావు, ప్రధాన కార్యదర్శి మామిడి గోపి, కోశాధికారి ఎ.జ్యోతి, కార్యదర్శి కె.అరుణ పద్మ పాల్గొన్నారు.

కంబాలకొండలో బోటు షికారు హాయిహాయి

ఖర్చు స్వల్పం... ఆహ్లాదం అధికం

అందుబాటులో వివిధ రకాల పడవలు

కార్తీక మాసం మినహా ఆదరణ అంతంతమాత్రమే



బోటు షికారుకు వెళుతున్న సందర్శకులు

ఆరిలోవ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగర సందర్శకులు పార్కులు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతారు. అలాంటి వారికి తూర్పు నియోజకవర్గం పరిధిలోని కంబాలకొండ చక్కని ఆహ్లాద ప్రదేశంగా చెప్పొచ్చు. ఇక్కడ డేగల కొండ రిజర్వాయర్‌లో బోటింగ్ చేయడానికి అవకాశం ఉంటుంది. ఎత్తయిన పచ్చని కొండలు, చుట్టు చక్కని వాతావరణం మధ్య ఇక్కడ బోటింగ్ చేయడానికి వీలుంటుంది.

ఇక్కడ మూడు రకాల పడవలు ఉంటాయి. వీటిలో కాయ్ కింగ్, ఫ్యామిలి బోటు, తొట్టె బోటు అందుబాటులో ఉన్నాయి. ఒక్కొక్కరికి టికెట్ రూ.200. చిన్నారులకు రూ.100. ఈ సందర్భంగా బోటు నిర్వాహకులు మాట్లాడుతూ.. కార్తీక మాసంలో రోజుకు 200 వరకు సందర్శకుడు వస్తుంటారని చెప్పారు. డిసెంబరు నెలలో కూడా సందర్శకులు కొంత మేర వస్తుంటాయరని, ఆ తరువాత రోజుకు పదుల సంఖ్యలోనే సందర్శకులు పరిమితం అవుతారని తెలిపారు. సుమారు అన్ని రకాలు కలిపి 20 పడవల వరకు ఉన్నాయన్నారు. బోటు షికారుకు వెళ్లే వారికి ప్రత్యేక కోటులు ఇస్తామన్నారు. సందర్శకుల జాగ్రత్త కోసం అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు.



కంబాలకొండలో బోటు షికారుకు ఉపయోగిస్తున్న వివిధ రకాల పడవలు

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

» ఏయూ వీసీ శశిభూషణరావు

» రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభం



సావనీర్ ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు, రిజిస్ట్రార్ ధనుంజయరావు తదితరులు

వెంకోజీపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులు అన్నిరంగాల్లో రాణించాలని ఏయూ ఉపకులపతి జి.శశిభూషణరావు ఆకాంక్షించారు. మంగళవారం ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం సమావేశ మందిరంలో ది సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'టువర్డ్స్ ఇంక్లూషన్ : ఎంపవరింగ్ పర్సన్స్ విత్ డిసేబులిటీస్ ఫర్ ఏ డెవలప్డ్ ఇండియా బై 2047" రెండు రోజుల జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ దివ్యాంగులకు అనుకూలంగా ఉండే విధంగా కార్యాలయాల నిర్మాణాలు జరగాలని సూచించారు. ఈ దిశగా ఏయూ కృషి చేస్తుందని చెప్పారు. అవకాశాలను అందిస్తే దివ్యాంగులు అవరోధాలను అధిగమిస్తారని చెప్పారు. ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు మాట్లాడుతూ వికసిత్ భారత్ సాకారం కావాలంటే దేశంలోని దివ్యాంగులు సైతం సాధారణ వ్యక్తులతో సమానంగా ప్రగతి సాధించే దిశగా ప్రోత్సహిస్తూ అవకాశాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం సంచాలకులు డాక్టర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకుని ఈ సదస్సును వర్తమాన అంశంపై నిర్వహించడం జరిగిందని తెలిపారు.

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (న్యూఢిల్లీ) జాయింట్ కార్యదర్శి డాక్టర్ ఆర్.మనోజ్‌కుమార్ కీలక ఉపన్యాసం ఇచ్చారు. సమ్మిళిత సమాజాన్ని నిర్మించడం విభిన్న ప్రతిభావంతులను భాగస్వాములను చేయడం ద్వారా మాత్రమే సాధ్యపడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. 2016లో అమల్లోకి వచ్చిన విభిన్న ప్రతిభావంతుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంగవైకల్యం కలిగిన వ్యక్తుల హక్కుల పరిరక్షణకు న్యాయస్థానాలు చేస్తున్న కృషిని ప్రశంసించారు. ప్రజా రవాణా వ్యవస్థ, మార్కెట్లు, రైల్వే స్టేషన్లు, ఎయిర్‌పోర్టు వంటి ప్రదేశాల్లో అంగవైకల్యం ఉన్న వారికి సైతం సులభంగా సంచరించే విధంగా పరిసరాలు ఉండాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. విశాఖపట్నం జోన్ 1 ప్రాంతీయ ఉపాధి అధికారి టి.అనిల్ కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులకు లభించే అవకాశాలను వివరించారు. తమ కార్యాలయం ద్వారా వీరిని ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గ్రూప్-1 అధికారిని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎ.రాణి తాను గ్రూప్-1 అధికారి కావడానికి చేసిన ప్రయత్నాన్ని, ప్రయాణాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ అంగవైకల్యం కలిగిన వ్యక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించే వేదికగా ఈ సదస్సు నిలుస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా అతిథులను సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు.

ఐడియాథాన్ నిర్వాహకులకు ఏయూ రిజిస్ట్రార్ అభినందనలు




విద్యార్థులను అభినందిస్తున్న రిజిస్ట్రార్

వెంకోజీపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల ఐడియాథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎకో ఇన్నోవేటిక్స్ పేరుతో విద్యార్థులకు నిర్వహించిన ఈ పోటీల్లో ఏయూలో వివిధ భాగాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పర్యావరణహితంగా నిలిచే వివిధ సాంకేతికత, పరికరాలను అభివృద్ధి చేసేదిగా పనిచేశారు. దీంట్లో మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు, రెండవ స్థానంలో వారికి రూ.2500, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.1000 నగదు పురస్కారాన్ని, ప్రశంసా పత్రాన్ని అందించారు. నూతన ఆలోచనలను ప్రోత్సహించే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఇందిర, కుసుమ అపర్ణ, ముదాసిర్, సబిహ తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తి ప్రత్యేకమైనది

» దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సిరిపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వైద్య వృత్తి ఎంతో ప్రత్యేకమైనదని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిపురం దత్ ఐల్యాండ్‌లోని ఇన్వోడెంట్ రెండో వార్షిక సదస్సు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ప్రతీ ఒక్కరికి దంతాలు ముఖ్యమన్నారు. దంతాల పరిరక్షణపై కలిపిస్తున్న అవగాహన సదస్సులు వినియోగించుకోవాలని సూచించారు. ఇన్వోడెంట్ ఫౌండర్ డాక్టర్ వెంకటమౌనిక మడిశ మాట్లాడుతూ ప్రత్యేకమైన శైలిలో దంత సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమన్నారు.ప్రతీ రోజు రెండు సార్లు దంతాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, ప్రజలు పాల్గొన్నారు.

షిప్‌బిల్డింగ్ డైరెక్టర్‌ను కలిసిన బీఎంఎస్ నాయకులు

మల్కాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : షిప్‌యార్డు షిప్ బిల్డింగ్ డైరెక్టర్ గంటి వెంకటేశ్వర్లును మంగళవారం ఉదయం బీఎంఎస్ నాయకులు ఆయన కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా షిప్‌యార్డులో సమస్యలను ఆయనకు వివరించారు. షిప్‌యార్డు మూతపడుతుందని అనుకొనే సమయంలో సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంస్థకు ఐదు ఫ్లీట్ సపోర్టు వెసెల్స్ ఆర్డర్‌ను తీసుకొని రావడం మనందరి అదృష్టంగా పేర్కొన్నారు. అందరం కలిసి సంస్థను కాపాడుకుంటామని వివరించారు. ఎల్‌అండ్‌ఎం సిరీస్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డైరెక్టర్‌ను కార్మిక నాయకులు కోరారు.

'పౌర గ్రంథాలయం అభివృద్ధికి సహకరిస్తా'



గ్రంథాలయంలో యువతతో సంభాషిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

సీతంపేట, డిసెంబరు 3: (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లోని విశాఖ పౌరగ్రంథాలయాన్ని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థులు, పోటీ పరీక్షలకు హాజరవుతున్న యువతతో మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న సేవలను గ్రంథాలయ సొసైటీ ప్రతినిధులు డీఎస్ వర్మ, టీఎస్ఆర్ ప్రసాద్‌లు ఎమ్మెల్యేకు తెలిపారు. గ్రంథాలయంలో పుస్తకాలు, కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధునికతతో పాఠకులు చదువుకోవడానికి ఈ గ్రంథాలయం ఎంతో ఉపయోగపడుతుందని, మరింత అభివృద్ధికి తన సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు గుండు సురేష్‌బాబు, చంటి, మాజీ కార్పొరేటర్ రాజు, శివప్రసాద్, నాగేశ్వరరావు, శ్రీనివాస్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అభిరుచికి తగ్గట్టుగా పుస్తక ప్రదర్శన



ప్రణవ్‌గోపాల్‌కు పుస్తకం అందజేస్తున్న నిర్వాహకులు

మహారాణిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): టర్నర్ చౌల్ట్రీలో ఏర్పాటు చేసిన విశాలాంధ్ర పుస్తక మహోత్సవాన్ని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎం.ప్రణవ్‌గోపాల్ మంగళవారం సందర్శించారు. పుస్తక ప్రదర్శన అన్ని వర్గాల ప్రజల అభిరుచికి తగ్గట్టుగా ఉందని, లాభాపేక్ష లేకుండా ఈ కార్యక్రమం నిర్వహించటం అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు. ఇలాంటి కార్యక్రమాలకు వీఎంఆర్‌డీఏ పూర్తిగా సహకరిస్తుందన్నారు.

'ఆసుపత్రి కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి'



కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో పని చేసిన కార్మికులను తొలగించడం అన్యాయమని, వెంటనే వారిని విధుల్లోకి చేర్చుకోవాలని విశాఖ జిల్లా హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వై.రాజు డిమాండ్ చేశారు. అక్కయ్యపాలెంలోని కార్మిక శాఖ కార్యాలయం ఎదుట మంగళవారం కార్మికులు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ అవసరానికి మించి కార్మికులు ఉన్నారని చెబుతూనే యాజమాన్యం కొత్తగా 20 మంది కార్మికులను విధుల్లోకి చేర్చుకొని పాత కార్మికులు 38 మందిని ఉద్యోగాల నుంచి తొలగించడం చట్ట విరుద్ధమన్నారు. నిబంధనలు పాటిస్తున్నామని చెబుతూ సీనియర్ కార్మికులను తొలగించి జూనియర్లను కొనసాగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆసుపత్రి యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖాధికారులను కోరారు. ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

సిమెంటురోడ్లకు మోక్షం లేని మురళీనగర్



నరసింహనగర్‌లోని ఓ వీధిలో వాన నీరు నిలిచిన మట్టి రోడ్డు

మాధవధార, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో మాధవధార, మురళీనగర్ ప్రాంతాలు బయట ప్రపంచం దృష్టిలో కీలకమైనవి. ఇక్కడ అడుగిడితే దూరపు కొండలు నునుపు అన్న నానుడి గుర్తుకు వస్తుంది. నివాసయోగ్యం కాని వీధులు పదుల సంఖ్యలో కనిపిస్తాయి. ఈ కోవలోకి చెందుతుంది 51వవార్డు మాధవధార నరసింహనగర్. ఎత్తైన అపార్ట్‌మెంట్లకు అనుమతి లభిస్తున్న ఈ ప్రాంతంలో మట్టి రోడ్డే దిక్కు. అనధికార నిర్మాణాలకూ అనుమతి వచ్చేస్తున్నా... రోడ్డు నిర్మాణానికి జీవీఎంసీ ప్రాధాన్యం ఇవ్వలేకపోతోంది. వందలాది నివాసాలు, వేలమంది జనాభా ఉన్నారు. మూడు రోజులు ముసురుపడితే చాలు.. ఈ మట్టి రోడ్లలో రాకపోకలకు అవస్థలే. నాయకులుగా చలామణీ అవుతున్న ప్రజాప్రతినిధులూ స్పందించరు. రోడ్డు వేయకపోవడానికి కోర్టు కేసు కారణమని కార్పొరేటరు ఆర్.వెంకటరమణ చెబుతున్నారు. అయినా పక్కనే ఉన్న వీధిలో సిమెంటు రోడ్డు ఇటీవలే రూపుదిద్దుకుంది. తమకు పక్కా రహదారుల ఏర్పాటుకు అనుమతి విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులపై జీవీఎంసీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. గడిచిన అయిదేళ్లగా ప్రతిపాదనల దశలోనే మిగిలిన రహదారి అంశాన్ని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం సాకారం చేయాలని కోరుతున్నారు. వర్షాల కారణంగా నాలుగు రోజులుగా ఈ ప్రాంత వాసులు అనేక అవస్థలు పడుతున్నారు. మాధవధార 51వ వార్డు పరిధిలోని సింహాచల గిరి ప్రదక్షిణ రోడ్డు కూడా మట్టి మార్గమే కావడం గమనార్హం!

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు శిక్షణ



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డా.నాగిరెడ్డి

కంచరపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యం మెరుగుపర్చుకోవడంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ఇంజినీరింగ్ విద్య నైపుణ్య సలహాదారు డాక్టరు నాగిరెడ్డి కొవ్వూరు పాల్గొని శిక్షణ ఇచ్చారు.'నీ గురించి నువ్వు తెలుసుకో' అన్న అంశంపై విద్యార్థులకు ప్రేరణ కల్గించారు. ఈ సందర్భంగా డాక్టరు నాగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులే భవిష్యత్ నిర్దేశకులని అన్నారు. చదువుతో పాటు తమ చుట్టూ ఉన్న పరిస్థితులను అవగాహన చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల పట్ల ప్రేమ, గౌరవం కలిగి ఉండడంతో పాటు ఆలోచనలు, విజ్ఞానం దేశ ప్రగతికి ఉపయోగపడేలా అభివృద్ధి చెందాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు మాట్లాడుతూ సత్ప్రవర్తన, క్రమశిక్షణతో కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవడం సులభమని సూచించారు. కార్యక్రమంలో సివిల్ హెడ్ రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో బుల్లయ్య కళాశాల ఉపాధ్యాయులు

సీతమ్మధార, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీ అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ చాంపియన్ పోటీల్లో బుల్లయ్య కళాశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ఫుట్‌బాల్ జట్టుకు నాయకత్వం వహించిన బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నవీన్‌కుమార్‌ను, జట్టు సభ్యులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీఎస్‌కె చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.శ్రీకాంత్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బీఆర్ఎస్ లక్ష్మణ్ రెడ్డి, గంగా భవాని విద్యార్థులను అభినందించారు.

ఉత్తమ సేవలందించిన రైల్వే సిబ్బందికి సత్కారం



ప్రమాదాన్ని నివారించిన ఉద్యోగికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వేలో విధుల నిర్వహణలో అంకితభావం, చిత్తశుద్ధి పాటించి ఉత్తమ సేవలందించిన సిబ్బందిగా గుర్తింపు పొందిన వారిని డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు మంగళవారం తన కార్యాలయంలో ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. లోకోమోటివ్ నుంచి వ్యాగన్ ఫ్రంట్ ఫాలోయర్ ప్లేట్ విరిగిపోయిందని గుర్తించి అప్రమత్తంగా వ్యవహరించిన క్యారేజ్ అండ్ వ్యాగన్స్ విభాగానికి చెందిన జి.రవికుమార్, జె.సంతోష్‌కుమార్, అలాగే బలుమస్కా సెక్షన్‌లో గూడ్స్ రైలు నుంచి పొగ రావడాన్ని గుర్తించి కంట్రోల్‌కు సమాచారమిచ్చి అప్రమత్తం చేసిన రైలు మేనేజర్ పవన్ సింగ్ మీనా, పార్వతీపురం స్టేషన్‌లో ప్రధాన ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ బ్రేక్ డౌన్‌ను నివారించిన ట్రాక్ నిర్వాహకుడు ఆర్.రవీంద్ర సబన్, సింహాచలం రైల్వే స్టేషన్ సమీపంలో ఒక రైలుకు చెందిన కాయిల్ స్ప్రింగ్‌లలో ఒకటి సరిగా అమర్చలేదని గుర్తించి స్టేషన్ సూపరింటెండెంట్, చీఫ్ ట్రైన్ ఎగ్జామినర్‌కు సమాచారమిచ్చిన రైలు మేనేజర్ ఉదయ్ భాస్కర్ తదితరులను సన్మానించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు మాట్లాడుతూ విధుల నిర్వహణలో సిబ్బంది ప్రదర్శించే చిత్తశుద్ధి, నిబద్ధత ప్రయాణికులకు భద్రతను కల్పించడమే కాకుండా రైల్వే ఆస్తులను కాపాడుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఇ.శాంతారామ్, సీనియర్ డివిజనల్ అధికారి సిద్ధార్థ ప్రధాన్ స్థానిక కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి విశిష్ట పూజలు



కనకమహాలక్ష్మి అమ్మవారికి అష్టదళ పద్మారాధన, 108 స్వర్ణ పుష్పాలతో అలంకరణ

జగదాంబ కూడలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం విశిష్ట పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి శ్రీ చక్రనవర్నార్చన, లక్ష్మీహోమం, వేదపారాయణం, సప్తశతీ పారాయణ, మహావిద్యాపారాయణ, పూర్ణాహుతి సేవలను ఆలయ పండితులు భక్తితో జరిపారు. అమ్మవారి ప్రత్యేక పూజల్లో భాగంగా శ్రీ చక్రపీఠం వద్ద లక్ష కుంకుమార్చనను వేదపండితులు, అర్చకులు నిర్వహించారు అదేవిధంగా ప్రతీ వారం నిర్వహించే అష్టదళ పద్మారాధన, 108 స్వర్ణ పుష్పాలతో అలంకరణ వంటి విశిష్ట పూజలను ఉభయదాతల చేత అర్చకులు జరిపించారు. ఈ పూజల్లో ఆలయ కార్యనిర్వహణాధికారిణి కె.శోభారాణి, అధికారులు పాల్గొన్నారు. శ్రీ జగన్నాథస్వామి ఆలయం వద్ద ఉచిత అన్న ప్రసాద వితరణకు భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. వెయ్యి మంది భక్తులకు ఆలయ అధికారులు అన్న సంతర్పణ చేశారు.

ప్రయాణికుల నిరీక్షణ ఒకచోట బస్సులు ఆగేది మరోచోట

కంచరపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ఊర్వశి జాతీయ రహదారిలో బస్ షెల్టర్ ఒక దగ్గర, బస్సులు ఆగేది మరో చోట కావడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఇక్కడ బస్టాప్‌కు సమీపంలో రెండు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, ప్రభుత్వ ఐటీఐలు ఉండడంతో నిత్యం వేలాది మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే బస్ షెల్టర్‌ను బస్సులు ఆగే ప్రాంతానికి దూరంగా నిర్మించడంతో ప్రయాణికులు జాతీయ రహదారి ఫుట్‌పాత్ వద్దనే నిరీక్షిస్తుంటారు. అయితే బస్సులు సకాలంలో రాకపోవడంతో విద్యార్థులు ఎక్కువసేపు నిల్చోలేక ఫుట్‌పాత్‌ల మీదే కూర్చొని ఉండడం దయనీయంగా కనిపిస్తుంది. అయితే సమీపంలో ఇటీవల రూ.లక్షలు ఖర్చు చేసి షెల్టర్‌ను నిర్మించినా బస్సులు నిలుపు స్థలానికి ఆమడ దూరంలో ఉండటం వలన నిరుపయోగంగా మారింది. ఇక్కడ బస్సుల కోసం వేచి ఉండేవారితో ఉదయం, సాయంత్రం చాలా రద్దీగా ఉంటుంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విశాఖ టు కాకినాడ.. వయా చోడవరం

... 5వ పేజీ తరువాయి

కలాసీగా పనిచేసిన ఒక వ్యక్తి ఇప్పుడు కోట్లు సంపాదించారని ఆ ప్రాంతంలో డీలర్లు చెబుతుంటారు.

గాజువాక, షీలానగర్, గోపాలపట్నం, పెందుర్తి, మధురవాడ ప్రాంతాల నుంచి ఆనందపురం, పెందుర్తి మీదుగా చోడవరం ప్రాంతానికి భారీగా రేషన్ బియ్యం తరలిపోతున్నాయి. కొందరు ఆనందపురం పరిసరాల్లో మిల్లులకు అమ్ముతున్నారు. ఇటీవల విజయనగరం జిల్లాలో మిల్లులకు విక్రయిస్తున్నారు. చోడవరం ప్రాంతానికి వెళ్లే రేషన్ బియ్యానికి కొంత పాలిష్ పెట్టి కాకినాడ తరలిస్తున్నారు. ఒక్కొక్కసారి వచ్చిన బియ్యం వచ్చినట్టే కాకినాడకు పంపుతుంటారు. ఈ వ్యవహారంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఒకరు స్వయంగా ఫిర్యాదు చేశారు.

గంగవరం పోర్టులో తనిఖీలు

కాకినాడ పోర్టు నుంచి ఆఫ్రికా దేశాలకు రేషన్ బియ్యం ఎగుమతి చేసే నౌకను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పట్టుకున్న నేపథ్యంలో అన్ని జిల్లాల్లో రేషన్ బియ్యం అక్రమాల గుట్టు తేల్చాలని ప్రభుత్వం ఆదేశించింది. విశాఖలో జేసీ మయూర్ అశోక్ కొద్దిరోజులుగా రేషన్ బియ్యం వ్యాపారంపై నిఘా పెట్టారు. ఆయన ఆదేశాల మేరకు పౌర సరఫరాల శాఖ అడపా దడపా దాడులు చేస్తుంది. తాజాగా కాకినాడ వ్యవహారంతో పౌర సరఫరాల గాజువాక ఏఎస్‌వో సోమవారం సాయంత్రం గంగవరం పోర్టును తనిఖీ చేశారు. గంగవరం పోర్టు నుంచి బియ్యం ఎగుమతులు లేవని నిర్ధారించారు. విశాఖ పోర్టు నుంచి బియ్యం ఎగుమతులను తనిఖీ చేయాలని నిర్ణయించారు. ఇందుకు జిల్లా యంత్రాంగం ద్వారా పోర్టు అనుమతి తీసుకోవాల్సి ఉంది. సోమవారం రాత్రి మల్కాపురం ప్రాంతంలోని క్రాంతినగర్, గాజువాక వుడా కాలనీల్లో రెండు ఇళ్లపై జిల్లా పౌర సరఫరాల అధికారి భాస్కరరావు దాడి చేసి 40 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. కాగా నగరంలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసే ఇళ్లు, దుకాణాలపై దాడులు కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

అక్రమార్కులపై డ్రోన్ ప్రయోగం

... 5వ పేజీ తరువాయి

ఏర్పడుతుంటాయి. అక్రమ నిర్మాణదారుల వద్ద టౌన్‌ప్లానింగ్ విభాగంలోని కొందరు అధికారులు, సిబ్బందితోపాటు కార్పొరేటర్లు, మీడియా పేరుతో మరికొందరు బెదిరింపులకు దిగడం, బలవంతపు వసూళ్లకు పాల్పడుతుంటారు. నిర్మాణదారుడు డబ్బులు ఇవ్వకపోతే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (స్పందన)లో ఫిర్యాదు చేస్తుంటారు. స్పందనకు వచ్చే ఫిర్యాదుల్లో అత్యధికం టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించినవి...అందులోనూ అక్రమ నిర్మాణాలకు సంబంధించినవే అధికంగా ఉంటున్నాయి. అదే విషయాన్ని ఇటీవల మీడియా సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో నగరంలో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడంపై కమిషనర్ దృష్టిసారించారు.

డ్రోన్‌తో అక్రమ నిర్మాణాలు గుర్తింపు

నగరంలో అక్రమ నిర్మాణాలను గుర్తించేందుకు వీలుగా 'డ్రోన్' తో సర్వే చేయాలని నిర్ణయించినట్టు కమిషనర్ తెలిపారు. నగరం అంతా ఒకేసారి కాకుండా పైలట్ ప్రాజెక్టు కింద ఏదో ఒక జోన్‌ను ఎంపిక చేయాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఆటోకాడ్‌తో సర్వే చేసి నివేదిక తయారుచేసిన తర్వాతే ప్లాన్ జారీచేస్తారు కాబట్టి, ఆ సమాచారాన్ని ప్రస్తుత స్థితి తెలిపే జీఐఎస్ (జియోగ్రఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్)తో అనుసంధానం చేసి డ్రోన్‌కు సాఫ్ట్‌వేర్‌ను అప్‌లోడ్ చేస్తామన్నారు. డ్రోన్ సర్వే చేసి ఆ రెండు నివేదికల ఆధారంగా భవన నిర్మాణాల్లో జరిగిన ఉల్లంఘనలు, ఏ స్థాయిలో జరిగాయనేది తెలియజేస్తుంది. వీటిని క్రోడీకరించిన తర్వాత అక్రమ నిర్మాణం స్థాయిని బట్టి చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో నిర్మించే భవనాలపై ప్రభుత్వానికి నివేదించి, అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు ముందుకు వెళతారు. ఇక అదనపు అంతస్తులు నిర్మించినా, సెట్‌బ్యాక్‌ల ఉల్లంఘనలు జరిగినా పది శాతంలోపు అయితే ఒక రకంగా, 25 శాతం వరకూ మరో రకమైన జరిమానా, అంతకంటే ఎక్కువ ఉల్లంఘన ఉంటే మరోలా చర్యలు తీసుకునే ఆలోచన ఉందని కమిషనర్ తెలిపారు. అన్నీ అనుకూలిస్తే ఈ నెలలోనే పైలట్ ప్రాజెక్టు కింద డ్రోన్ సర్వే జరపాలని టౌన్‌ప్లానింగ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఫార్మా కంపెనీల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

యాజమాన్యాలకు అలుసుగా మారినట్టు ప్రచారం జరుగుతోంది.

ఠాగూర్ యాజమాన్యం యూనిట్-3లో 17 రకాల మందుల తయారీకి ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుంది. అందులో లామివుడీన్ లేదు. కానీ ఉత్పత్తి చేస్తున్నారు. మొదటి బ్యాచ్ మందు తయారు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ఇలా అనుమతులు లేకుండా అత్యంత కీలకమైన మందులు తయారుచేయవచ్చునా?, ఇలాంటి అంశాలను అధికారులు తనిఖీల ద్వారా గుర్తించి చర్యలు చేపట్టరా?...అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పెట్టుబడులు, ఉపాధి అనే అంశాల ఆధారంగా ఫార్మా కంపెనీలు ఏమి చేస్తున్నా పాలకులు పెద్దగా స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ వరుస ప్రమాదాలపై హై లెవెల్ కమిటీ విచారణ జరుగుతున్న సమయంలోనే అవే మళ్లీ పునరావృతం కావడం మరో విశేషం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందిస్తుందా? కఠిన చర్యలు తీసుకుంటుందా?...అనేది చూడాలి. ఇలాంటి అనుమతి లేని ఉత్పత్తులు ఇంకా ఎక్కడెక్కడ జరుగుతున్నాయో గుర్తించి, తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

స్కిల్ హబ్‌లలో నిరుద్యోగులకు శిక్షణ

... 5వ పేజీ తరువాయి

కళాశాలలో కోర్సు ఆన్ కంప్యూటర్ కాన్సెప్ట్ (9121676360), డాక్టర్ వీఎస్ కృష్ణ డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో ఆఫీస్ అసిస్టెంట్ (9885694676), గాజువాకలోని నాక్ శిక్షణ కేంద్రంలో అసిస్టెంట్ ప్లంబర్ జనరల్ (9493837994), నగర పరిధిలోని నాక్ శిక్షణ కేంద్రంలో గల స్కిల్ హబ్‌లో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సు (9676170026)లో శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు వెల్లడించారు. ఆయా కోర్సుల్లో చేరాలనుకునే అభ్యర్థులు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ నెల నాలుగో తేదీ (గురువారం) వరకూ రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందని వివరించారు. నాన్ రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం అభ్యర్థులకు సర్టిఫికెట్‌తోపాటు అసెస్‌మెంట్ టెస్ట్ నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తా మన్నారు. స్వయం ఉపాధి పొందేలా యూనిట్లు పెట్టుకుంటామనుకునే వారికి అవసరమైన సహకారాన్ని అందిస్తామని తెలిపారు.

కళాసాహితి కార్యదర్శి సన్యాసిరాజు మృతి

శబరిమలై యాత్రలో గుండెపోటుతో దుర్మరణం



సన్యాసిరాజు (ఫైల్)

భీమునిపట్నం డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భీమిలి కళాసాహితి ప్రధాన కార్యదర్శిగా ఉన్న అడిదం సన్యాసిరాజు శబరిమలై యాత్రకు వెళ్లి మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఈ సమాచారాన్ని అక్కడి నుంచి భీమిలి వాసులకు చేరడంతో భీమిలిలో విషాద వాతావరణం నెలకొంది. గత కొన్ని సంవత్సరాలుగా గాయకుడిగా, కళాకారుడిగా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. ఆయనకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత ఆదివారం భీమిలిలో జరిగిన రచయితల సమావేశంలో చురుగ్గా వ్యవహరించిన ఈయన మృతికి కళాసాహితి అత్యవసర సమావేశం సంతాపాన్ని తెలియజేసింది. హిందూ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు మైలపల్లి షణ్ముఖరావు అయ్యప్ప సేవా పీఠం సభ్యులు సంతాపాన్ని తెలియజేశారు.

కొట్టి పడేసిన చెట్ల కొమ్మలు రోడ్లపైనేనా?



ఉడాకాలనీ బస్టాపు వద్ద కమ్యూనిటీ హాలు దగ్గర చెట్ల వ్యర్థాలు

మురళీనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఆ శాఖ సిబ్బంది, పరిసరాల పరిశుభ్రత పేరిట జీవీఎంసీ వారు తరచూ చెట్ల కొమ్మలు నరికేస్తుంటారు. గ్రేటరు 51వ వార్డు మాధవధార ఉడాకాలనీ ప్రాంతంలోని రోడ్లలో ఎక్కడ చూసినా, కొట్టి పడేసిన చెట్ల వ్యర్థాలే కనిపిస్తున్నాయి. కరెంటు తీగెల నిర్వహణ కోసం కొట్టేసినవి కొన్నయితే, కాలనీ సంక్షేమ సంఘాలు వీధుల శుభ్రత పేరిట నరికించిన కొమ్మలు కొన్ని ఉంటున్నాయి. పనులు ముగిశాక, చెట్ల వ్యర్థాలు రోడ్లపైనే పడేస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పారిశుధ్య సిబ్బంది, ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది, కాలనీ సంక్షేమ సంఘాలు గానీ పట్టించుకోవడం లేదు. దీంతో ప్రధాన రహదారుల నుంచి వీధి రోడ్ల వరకు ఎండిన చెట్ల కొమ్మలు, పెద్ద పెద్ద చెట్ల కలప రోడ్లకు అడ్డంగా పేరుకుంటోంది. వీటి చుట్టూ స్థానికులు పారబోసే చెత్త పోగులు పరిస్థితులను మరింత దుర్భరంగా మారుస్తున్నాయి. అధికారులు దృష్టి సారించి ఇబ్బందులు తొలగించాని స్థానికులు కోరుతున్నారు. ఈపీడీసీఎల్, జీవీఎంసీ విభాగాల సమన్వయంతో పాటు కాలనీ సంఘాలు మాధవధార ఉడాకాలనీలో ఎక్కువగా ఉండే చెట్ల నిర్వహణ తీరుపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలి



దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



ఎన్‌జీజీఓస్ కాలనీలో మాట్లాడుతున్న ఎంఈవో రామారావు



కొండగుడి వద్ద కొవ్వొత్తుల తయారీపై అవగాహన కల్పిస్తున్న శ్రీలక్ష్మి

డాబాగార్డెన్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తే సమాజంలో ఉన్నతంగా రాణించేందుకు అవకాశాలు ఉంటాయని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్ ద్వారకాబజార్‌లోని 'ది ఎబిలిటీ పీపుల్' ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే అక్కడివారితో ముచ్చటించారు. కృత్రిమ అవయవాలను ఉపయోగించే విధానాన్ని తెలుసుకున్నారు. దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తే గొప్పస్థాయికి చేరుకోవచ్చన్నారు. విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి తనవంతు సంపూర్ణంగా సహాయసహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమ నిర్వాహక సంస్థ డైరెక్టర్ దిలీప్ పాత్రో మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పడాల విజయశంకర్, కూటమి నాయకులు పాల్గొన్నారు. పలువురికి ఉచితంగా వీల్‌చైర్లు, కృత్రిమ అవయవాలను అందజేశారు.

దివ్యాంగుల ప్రోత్సాహానికి అందరూ ముందుకు రావాలి

అక్కయ్యపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు అందరూ ముందుకు రావాలని 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి పిలుపునిచ్చారు. ఎన్‌జీజీఓస్ కాలనీలోని భవిత కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రావణి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులను విజేతలుగా నిలబెట్టాలన్నారు. సీతమ్మధార ఎంఈవోలు రామారావు, బాలామణి మాట్లాడుతూ వారి భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ ఆటల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పద్మజ, ఉపాధ్యాయులు ఎ.సునంద్, ఎంవీ విశ్వనాథం, నిర్మల, భవిత కేంద్రం ఉపాధ్యాయులు జగదాంబ, శారద తదితరులు పాల్గొన్నారు.

స్వయంశక్తితో ఎదగాలి

జగదాంబ కూడలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు సమాజంలో స్వయంశక్తితో ఎదగాలని వేదాంత, విజిసిబి పోర్టు సిఎస్ఆర్ హెడ్, పిఆర్ఓ శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పాతపోస్టాఫీసు కొండగుడి వద్ద దివ్యాంగులకు కొవ్వొత్తుల తయారీలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులు ఇలాంటి శిక్షణ తరగతుల ద్వారా నైపుణ్యం సాధించి, స్వతంత్రంగా సమాజంలో బతకాలన్నారు. ఈ కేంద్రంలో కొవ్వొత్తుల తయారీలో శిక్షణ పొందిన వారికి పరిశ్రమకు కావలసిన పరికరాలు ఉచితంగా అందజేస్తామన్నారు. ముడి సరుకు కూడా సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొండగుడి ఫాదర్ జోసెఫ్, ఆప్రో ప్రాజెక్టు మేనేజర్ కె.విజయభాస్కర్, కో-ఆర్డినేటర్ వై.అశోక్ కుమార్, కమ్యూనిటీ మొబిలైజర్స్ అనిల్, ఆశ, సాయి, 30 మంది దివ్యాంగులు శిక్షణలో పాల్గొన్నారు.

బొర్రమాంబకు విశేష పూజలు



అగనంపూడి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత బొర్రమాంబ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉక్కు పరిరక్షణకు ఐద్వా పోస్టుకార్డు ఉద్యమం

కూర్మన్నపాలెం ,డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌సిటీ జోన్ ఐద్వా కమిటీ మహిళలు పోస్టుకార్డు ఉద్యమంలో భాగంగా మంగళవారం 86వ వార్డు ద్వారకాపురి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పోస్టుకార్డులు పంపిణీ చేసి ప్రజల మద్దతు కోరారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సత్యవతి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని విరమించుకోవాలని, తక్షణమే సంస్థ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు కె.విమల, కె.వేణు, వరలక్ష్మి, సుభాషిణి, ప్రభ, సుమలత, పద్మావతి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రికెట్ టోర్నీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జింక్ మైదానంలో ఈ నెల 9 నుంచి 11 వరకు నిర్వహించనున్న దివ్యాంగుల రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల పోస్టర్‌ను మంగళవారం ఇక్కడ బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పది జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరు కానున్నారన్నారు. నాయకులు గుర్నాథ్‌రెడ్డి, నరసింహ, సునీల్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెందుర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి అదృశ్యంపై మంగళవారం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి సీఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాలివి. పెందుర్తిలోని మర్రిచెట్ల కాలనీకి చెందిన గొర్లి దేవుడుబాబు సోమవారం ఇంట్లో సెల్‌ఫోన్ ఉంచి తన భార్యను ఆస్పత్రికి తీసుకెళుతున్నానని సమీపంలో తన కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడు. అతడు ఎంతటికీ ఇంటికి చేరలేదు. దీంతో బంధువులు, స్నేహితులకు వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో అతని తండ్రి తాతబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎన్ఎస్‌టీఎల్‌లో 'స్వచ్ఛతా శ్రమదాన్'

గోపాలపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఎస్‌టీఎల్‌లో స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతా శ్రమదాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌టీఎల్ గేటు సమీపంలోని అబ్దుల్ కలామ్ ప్రేరణాస్థల్ ప్రాంగణంలో శ్రమదానం నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై చెత్తను తొలగించారు. ఈ నెల 15వ వరకూ పలు స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శాంకేతిక సలహాదారు వైవీఎస్ చంద్రశేఖర్, లెఫ్టినెంట్ కల్నల్ రాహుల్ దీక్షిత్, ఎన్ఎస్‌టీఎల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి అర్జీకి పరిష్కారం

- ప్రభుత్వ విప్ గణబాబు
- జీవీఎంసీ 89, 60 వార్డుల్లో ప్రజా సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న విప్ గణబాబు

గోపాలపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ ముఖ్య ఉద్దేశ్యమని ప్రభుత్వ విప్ పి.గణబాబు అన్నారు. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం గ్రామ కూడలిలో మంగళవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి ఒక్కరితో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నియోజక వర్గంలోని ప్రతి వార్డులో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఆయా ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గణబాబు కోరారు. సామాజిక పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, ఇంటి పన్నుల మార్పు తదితరాలపై ప్రజల నుంచి 174 అర్జీలు వచ్చినట్టు అధికారులు వెల్లడించారు. తహసీల్దార్ సీహెచ్‌వీ రమేశ్, జోనల్ కమిషనర్ హేమవతి, వార్డు కార్పొరేటర్ వెంకటరమేశ్, వార్డు అధ్యక్షుడు బి.విజయ్‌కుమార్‌తో పాటు పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మల్కాపురం : ప్రజా దర్బార్ ద్వారా సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని విప్ గణబాబు అన్నారు. 60వ వార్డు ఇందిరా కాలనీలో మంగళవారం ప్రజా దర్బార్ నిర్వహించి అర్జీలను స్వీకరించారు. సంక్షేమ ఫలాలు అన్నివర్గాల ప్రజలకు అందాలన్నదే కూటి ప్రభుత్వం లక్ష్యంగా పేర్కొన్నారు. సామాజిక పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, కొత్తరేషన్ కార్డులు, ఇంటి పన్నుల మార్పులకు సంబంధించి పలువురు అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ములగాడ తహసీల్దార్ భుజంగరావు, జీవీఎంసీ జోన్- 5 కమిషనర్ రాము, 60వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మాతా శ్రీను, ఏపీ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రామ్మోహన్‌నాయుడు, నాయకులు బుద్ధ త్రినాథ్, వినయ్, పోలీసు అధికారులు, జీవీఎంసీ అధికారులు, రెవెన్యూ, పౌర సరఫరాలు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో పాటు సచివాయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులు ప్రజలతో మమేకం కావాలి

- నగర పోలీసు కమిషనర్ శంఖ బ్రత బాగ్చి



శిలాఫలకం ఆవిష్కరణలో నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి

మల్కాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు ప్రజలతో మమేకమై శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేయాలని నగర పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చి పేర్కొన్నారు. మల్కాపురం పోలీసు స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద పోలీసు సంక్షేమ శాఖ నిధుల నుంచి కాలువను నిర్మించారు. ఈనిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ఇక్కడ డ్రైనేజీ లేకపోవడం వలన వర్షాలుపడితే పోలీసు స్టేషన్‌లోకి వరద నీరు వచ్చేదన్నారు. దీంతో పోలీసు సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. ఈ నిర్మాణం వలన సమస్యకు తెర పడనుందన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో పోలీసులు మర్యాదపూర్వకంగా వ్యవహరించి, ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సౌత్ విభాగం డీసీపీ-2 మేరి ప్రశాంతి, హార్బర్ సర్కిల్ ఏసీపీ కాళిదాస్, మల్కాపురం పోలీసు స్టేషన్ సీఐ విద్యసాగర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారానికి 'చెల్లూరి' ఎంపిక



మల్కాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రకాశ్‌నగర్‌కు చెందిన ప్రముఖ చిత్రకారుడు, సామాజిక సేవా కార్యకర్త చెల్లూరి భాస్కరరావు ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకినాడకు చెందిన హ్యూమాన్ రైట్స్ ఫౌండేషన్ 30 ఏళ్లుగా సామాజిక సేవలందిస్తున్న చెల్లూరి భాస్కరరావును గుర్తించి ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేశారు. డిసెంబర్ 11న కాకినాడలో జరగనున్న కార్యక్రమంలో భాస్కరరావుకు అవార్డు అందించనున్నారు. ఈ సందర్భంగా పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు చిత్రకారులు ఆయనను అభినందించారు.

గొల్లలపాలెం చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విశాఖ పాస్టర్స్ చర్చస్ ఆధ్వర్యంలో మండలంలోని గవరపాలెం పంచాయతీ పరిధి గొల్లలపాలెం చర్చిలో మంగళవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఏసు క్రీస్తు అందరికీ ప్రభువు అన్నారు. ఆయన చూపిన మార్గంలో అంతా నడవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, మాజీ సర్పంచ్‌లు కోరిబిల్లి సుందరరావు, కరక దేవుడు, జనసేన నేత గొర్లె అప్పారావు, పిళ్లా జగన్మోహనపాత్రుడు, టీడీపీ నేత బయిలపూడి హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



దివ్యంగురాలికి రైల్వేపాస్ అందజేస్తున గణబాబు

మల్కాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, వీరికి అందించే పథకాలపై విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వ విప్ పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రకాశనగర్ ఏడుగుళ్ల జంక్షన్ వద్ద ఉన్న విఘ్నేశ్వర వెంకటసాయి దివ్యాంగుల సంక్షేమ సంఘంలో మంగళవారం ఏర్పాటైన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. దివ్యాంగులు మానసి ధైర్యంతో అన్నిరంగాల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. అనంతరం పలువురికి రైల్వే, బస్ పాస్‌లను అందజేశారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సింగుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ఇపీఎస్ భాగ్యలక్ష్మి, పలువురు నాయకులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

భవిత సెంటర్‌లో....

ఇదిలావుంటే, జీవీఎంసీ మల్కాపురం ప్రాథమిక పాఠశాలలో గల భవిత సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ములగాడ ఎంఈవో ఎల్.వెంకట్రావు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయిని అరుణకుమారి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పెద్దాడ హరికృష్ణ హాజరయ్యారు. ఈ సెంటర్‌లో సమస్యలు ఉంటే తెలియజేయాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. అనంతరం వివిధ ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

'ఉక్కు ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చాలి'



ఆస్పత్రి హెచ్‌వోడీ సారంగిని సత్కరిస్తున్న ఇంటక్ నాయకులు

ఉక్కు టౌన్‌షిప్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో సౌకర్యాలు మరింత మెరుగుపర్చాలని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ కోరారు. ఉక్కు ఆస్పత్రి హెచ్‌వోడీగా నియమితులైన డాక్టర్ సారంగిని మంగళవారం యూనియన్ నాయకులతో కలిసి వెళ్లి అభినందనలు తెలిపారు. ఆస్పత్రిలో సౌకర్యాలు మరింత మెరుగుపర్చాలని, టెక్నీషియన్లను నియమించాలని, మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారు రమణ, ప్రసాదరావు, జెర్రిపోతుల మోహన్‌కుమార్, బీటీ జగదీష్, పీవీరమణమూర్తి, ఎస్‌పీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

షిప్‌బిల్డింగ్ డైరెక్టర్‌ను కలిసిన బీఎంఎస్ నాయకులు

మల్కాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : షిప్‌యార్డు షిప్ బిల్డింగ్ డైరెక్టర్ గంటి వెంకటేశ్వర్లును మంగళవారం ఉదయం బీఎంఎస్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా షిప్‌యార్డులో సమస్యలను ఆయనకు వివరించారు. షిప్‌యార్డు మూతపడుతుందని అనుకొనే సమయంలో సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంస్థకు ఐదు ఫ్లీట్ సపోర్టు వెసెల్స్ ఆర్డర్‌ను తీసుకొని రావడం మనందరి అదృష్టంగా పేర్కొన్నారు. ఎల్అండ్ఎం సిరీస్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డైరెక్టర్‌ను కార్మిక నాయకులు కోరారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్‌కు ఎంపికైన విద్యార్థులకు అభినందన

కూర్మన్నపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో శ్రమిస్తే ఏ రంగంలోనైనా ఉన్నత స్థానాలకు చేరుకుంటారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. జీవీఎంసీ 87 వార్డు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థుల అభినందన సభలో మాట్లాడారు. త్వరలో కర్నూలులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. హెచ్ఎం సూర్యప్రకాష్, వ్యాయామ ఉపాధ్యాయుడు మన్నాజీ, నారాయణరావు, ఎస్ఎస్ విజయరామరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో అనారోగ్య సమస్యలు



ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని నినాదాలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

గాజువాక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వాడకంతో అనేక అనర్థాలు తలెత్తుతాయని మునిసిపల్ అధికారులు అన్నారు. మంగళవారం పాతగాజువాక జంక్షన్‌లో ఇందుకు సంబంధించిన నినాదాలు చేశారు. బయటకు సామగ్రి కోసం వెళ్లిన వారు తప్పనిసరిగా ఇంట్లో నుంచి సంచిని వెంటన తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రస్టులకు రికవరీ సొమ్ము చెల్లించాలి : ఇంటక్

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల నుంచి రికవరీ చేసిన పీఎఫ్, ఎస్‌బీఎఫ్ సొమ్మును ఆయా ట్రస్టులకు వెంటనే చెల్లించాలని స్టీల్ ఇంటక్ నాయకులు పే సెక్షన్ డీజీఎం రామ్‌ప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం సమస్యలపై ఆయనతో చర్చించారు. నాయకులు మంత్రి రాజశేఖర్, పీవీ నగేష్, ప్రభాకర్‌రెడ్డి, గోపాలరాజు, దేముడు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **మెకానిక్ రాఖీ :** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

● **దేవకీనందన వాసుదేవ :** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **జీబ్రా :** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)

● **కంగువా :** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)

● **లక్కీ భాస్కర్:** వెంకటేశ్వర

● **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 46, వంకాయలు(తెలుపు) 28, వంకాయలు (నలుపు) 34, బెండకాయలు 18, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 30, క్యారెట్ 58 దొండకాయలు32, బంగాళదుంపలు 37, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 28 దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ 60, పొటల్స్ 50, కీరదోస 28, కాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44,చిలగడదుంపలు 38, కంద58, దేముడుచిక్కుడు 56, కొండఉసిరి 50, కరివేపాకు (కిలో) 55, కొత్తిమీర (పెద్దకట్ట)35, పుదీన(కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిదగుమ్మడి కాయ30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	92
ఫారం ధర	112
విత్ స్కిన్	194
స్కిన్‌లెస్	204

'కార్యకర్తలే టీడీపీకి వెన్నెముక'



శ్రీనగర్ కాలనీ సభ్యత్వ నమోదులో కార్పొరేటర్

కూర్మన్నపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తలే టీడీపీకి వెన్నెముక అని 71 వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, టీడీపీ రాష్ట్ర పరిశీలకులు పప్పు రాజారావు అన్నారు. వార్డు పరిధి శ్రీనగర్ కాలనీలో మంగళవారం వార్డు ఇన్‌చార్జి పప్పు శంకరరావు ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సభ్యత్వ నమోదుతో కార్యకర్తతో పాటు కుటుంబానికి భరోసా, భద్రత ఉంటుందన్నారు. వార్డు బీసీ యువత అధ్యక్షులు ప్రతాపరావు శ్రీనివాసరావు, కిశోర్ కుమార్, పోతురాజు, బాబూరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

అగనంపూడి : టీడీపీతోనే యువతకు ఉజ్వల భవితని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. శ్రీరామ్‌నగర్‌లో కాలనీలో మంగళవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పార్టీ నాయకులు రౌతు మూర్తి, విరోతి మణికంఠ, రాజేశ్, రమణ, తిరుపతి రావు, రాజేశ్, నాయుడు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



75వ వార్డులో సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ : జీవీఎంసీ 75వ వార్డులో సభ్యత్వ నమోదు చురుగ్గా సాగుతోంది. వార్డు టీడీపీ అధ్యక్షుడు నమ్మి అప్పారావు, విశాఖ పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దాడ సోమునాయుడు ఆధ్వర్యంలో సీతానగరం, ఎస్సీ కాలనీ, నెల్లిముక్కు, దుర్గవానిపాలెం ప్రాంతాల్లో ఇంటింటా సభ్యత్వనమోదు డ్రైవ్ నిర్వహించారు. సభ్యత్వ నమోదు కో-ఆర్డినేటర్ పల్లా రమణ, క్లస్టర్ ఇన్‌చార్జి పెంటిరాజు కమిటీ నాయకులు పాల్గొన్నారు.

నిల్వ ఆహారం విక్రయించిన కామత్ హోటల్‌పై చర్యలు తీసుకోండి

- కలెక్టర్‌కు ఓ వినియోగదారుడి వినతిపత్రం

సిరిపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిల్వ ఆహారం విక్రయిస్తున్న బీచ్‌రోడ్డులోని కామత్ హోటల్‌పై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు మంగళవారం బసవ కృష్ణమూర్తి అనే వ్యక్తి వినతిపత్రం సమర్పించారు. ఫిర్యాదుదారుని కథనం ప్రకారం..సోమవారం సాయంత్రం కృష్ణమూర్తి లాసన్స్‌బే కాలనీ వద్ద గల కామత్ హోటల్‌కు వెళ్లి కౌజు పిట్ట మాంసం కొనుగోలు చేశారు. ఇరవై నిమిషాల తరువాత తినే ప్రయత్నం చేయగా కుళ్లిన వాసన రావడంతో ఫుడ్ సేఫ్టీ అధికారికి ఫోన్ చేశారు. తాను బయట ఉన్నానని ఇప్పుడు రాలేనని, తమ డిపార్టుమెంట్‌కు సిబ్బంది కొరత ఉందని మంగళవారం ఉదయం రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని అప్పుడు చర్యలు తీసుకుంటానని...మరీ అర్జంట్ అయితే తమ డిపార్టుమెంట్‌కు చెందిన వేరొకరికి ఫోన్ చేయాలని సూచించారు. ఆయనకు ఫోన్ చేయగా, అది తన పరిధిలోకి రాదని, కుళ్లిందని ల్యాబ్‌కు పంపినా ప్రూవ్ చేయలేమని సమాధానం ఇచ్చారు. ఈ నేపథ్యంలో నిల్వ ఉంచిన ఆహారాన్ని విక్రయిస్తున్న హోటళ్లపై చర్యలు తీసుకోవాలని, నిరంతరం అధికారులు పర్యవేక్షించే విధంగా చూడాలంటూ కలెక్టర్‌కు కృష్ణమూర్తి విజ్ఞాపన పత్రం అందజేశారు.

కార్మికుల సస్పెన్షన్‌పై కాగడాలతో నిరశన



ఎన్ఏడీ ఎదుట కాగడాలతో నిరసన తెలుపుతున్న కార్మికులు, కార్మిక నాయకులు

ఎన్ఏడీ జంక్షన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సాకేతపురం ఎన్ఏడీ కార్టర్స్‌లో ఉన్న ఎన్ఏడీ కార్యాలయం ఎదుట ఎన్ఏడీ సీఈ యూనియన్ నాయకులు, కార్మికులు మంగళవారం నిరశన దీక్షతో పాటు కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు థామస్ మాట్లాడుతూ ఎన్ఏడీ యాజమాన్యం తీసుకున్న తప్పుడు నిర్ణయాలను ఇప్పటికైనా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులను భయపెట్టి ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నేవల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు రెడ్డి వెంకట్రావు మాట్లాడుతూ విశాఖ నగరంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లోని యూనియన్లు తమ ఉద్యమానికి మద్దతు తెలిపినట్టు చెప్పారు. ఈ నెల 12న అన్ని యూనియన్లు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. అంతకుముందు ఎన్ఏడీ గేటు నుంచి సాకేతపురం అంబేడ్కర్ విగ్రహం వరకు కాగడాలతో ర్యాలీ నిర్వహించారు.యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, అధ్యక్షుడు పి.నూకరాజు, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సినీ గేయ రచయిత కులశేఖర్‌కు నివాళి




కులశేఖర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సభ్యులు

గోపాలపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మృతి చెందిన సినీగేయ రచయిత కులశేఖర్‌కు గోపాలపట్నం కళా సేవా పీఠం సభ్యులు మంగళవారం నివాళులర్పించారు. స్థానిక కళా సేవా పీఠం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కులశేఖర్ సంతాప కార్యక్రమంలో సేవా పీఠం సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సేవా పీఠం సభ్యులు పాల్గొన్నారు.

ఉక్కు నిర్వాసితులకు అండగా భూలోకరెడ్డి

- వర్ధంతి సభలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



భూలోక రెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉక్కు నిర్వాసితులకు అండగా నిలిచి, వారికి ఉపాధి కల్పనకు నిర్విరామంగా శ్రమించిన నాయకుడు నిర్వాసిత సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పులి భూలోకరెడ్డి అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. భూలోకరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా మంగళవారం పెదగంట్యాడ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం భూసేకరణ దశలో ఇళ్లు, భూములు కోల్పోయిన వారిని నిర్వాసిత కాలనీకి తరలింపులో, వారికి ఆర్‌కార్డుల మంజూరులో, ఉపాధి కల్పనలోను భూలోకరెడ్డి ప్రధాన భూమిక పోషించారన్నారు. విశాఖ పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు, పీబీఆర్ ట్రస్ట్ అధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, జీవీఎంసీ కార్పొరేటర్లు పులి లక్ష్మీబాయి, గంధం శ్రీనివాసరావు, కాకి గోవిందరెడ్డి, పల్లా శ్రీనివాసరావు, బొడ్డు నరసింహపాత్రుడు, రౌతు శ్రీనివాసరావు, ఇమ్రాన్, దల్లి గోవిందరెడ్డి, తిప్పల వంశీరెడ్డి, స్టీల్‌ప్లాంట్ ట్రేడ్ యూనియన్ నాయకులు మంత్రి రాజశేఖర్, ఎన్.రామారావు, డీవీ రమణ, గణపతిరెడ్డి, దొమ్మేటి అప్పారావు, గొందేశి మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఇంటి పంట.. భలే రుచులంట!

మిద్దెలపై సాగు.. దిగుబడులు బాగు

- సేంద్రియ పద్ధతిలో సత్ఫలితాలు
- ఎరువుల తయారీలోనూ ప్రావీణ్యం
- ఆదర్శంగా నిలుస్తున్న తిరుమలనగర్ కాలనీ వాసులు

నేడు సర్వం కలుషితమై మానవాళి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఈ విపరిణామాల నుంచి బయటపడేందుకు 'ఇంటి వంట..సొంత పంట' తృప్తినిస్తాయని కొందరు అనుభవ పూర్వకంగా నిరూపిస్తున్నారు. కూరగాయల కోసం మార్కెట్‌కు వెళ్తాం. కానీ వాటిని ఎక్కడ, ఎలా పండించారో, ఏయే ఎరువులు వాడారో మనకు తెలీదు. డబ్బు పెట్టి విషతుల్యమైన ఆహారాన్ని కొని తెచ్చుకుంటాం. అలాకాకుండా మన ఇంటి అవసరాలకు తగ్గ కూరగాయలను మనమే పండించుకోగలిగితే.. ఆ రుచి-తృప్తి అమోఘం. ఇందులో భాగంగా కొంతమంది పెరటితోటల పెంపకానికి ప్రాధాన్యమిస్తుండగా, స్థలం లేని మరి కొందరు మిద్దెలను సద్వినియోగం చేసుకుంటున్నారు. జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్ వాసులు సేంద్రియ సాగుతో చక్కని కూరగాయలు పండిస్తున్నారు.

- కూర్మన్నపాలెం, ఆంధ్రజ్యోతి





తిరుమల నగర్ కాలనీ వాసులు మొక్కల సంరక్షణలోనే ఎక్కువ సమయం గడుపుతారు. వాటికి రోజూ నీళ్ల పోయడం, సేంద్రియ పద్ధతిలో సాగు చేయడం అలవాటుగా మార్చుకున్నారు. ఇందుకోసం గో మూత్రం, నల్ల బెల్లం, బాగా మగ్గిన పండ్లు, కూరగాయల వ్యర్థాలు, ఇంట్లో మిగిలిన అన్నం, బియ్యం కడుగు, గంజి వంటి వాటితో ఎరువులను తయారుచేస్తున్నారు. ఈ క్రమంలో మిద్దెతోట మంచి దిగుబడులు ఇస్తుండడంతో పూలు, పండ్లు, కూరగాయలను కొనుగోలు చేసి తెచ్చుకొనే అవసరం రాలేదని చెబుతున్నారు. అంతేకాకుండా తమ ఇంట పండిన కూరగాయలను ఇరుగు, పొరుగు వారికి, స్నేహితులకు, బంధువులకు ఇస్తుంటామంటున్నారు.









తిరుమలనగర్‌లో టెర్రస్‌పై పెంచుతున్న పలు రకాల పూలు, పండ్లు, కూరగాయల మొక్కలు

ఇంట్లోనే సేంద్రియ ఎరువు తయారీ

కాలనీ వాసులకు ఇంటి పంట అంటే మక్కువ. కొంతమంది మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎక్కువ ఫలసాయం వచ్చేందుకు పోషకాలు గల ద్రావణం తయారుచేసి మొక్కలకు అందిస్తున్నారు. కూరగాయల వ్యర్థాలు, అరటి పళ్లు, తెలగ పిండి, వేపాకు, పిండి, చిట్టు, బెల్లం కలిపి నిల్వచేసిన ద్రావణాలను వినియోగిస్తూ, రాలిన ఆకులు, ఎండిన మొక్కలు, ఆవు, గేదె పేడలను సేకరించి ఎరువులను తయారుచేస్తున్నారు.



తాజా కూరగాయలతో ఆరోగ్యం



మా డాబాపై సుమారు 240 రకాల మొక్కలున్నాయి. ఆరేళ్లుగా పెంచుతున్నాను. పూలు, క్రోటాన్ మొక్కలతో పాటు దుంప, వంగ, అరటి, తోటకూర, బచ్చలి, గోంగూర, చుక్క కూర, పుదీనా, కొత్తిమీర, పచ్చిమిర్చి, టమాటా ఉన్నాయి. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన వీటిని తింటే ఆరోగ్యం. ప్రస్తుతం మార్కెట్లో కూరగాయల ధరలు పెరిగిపోతున్న తరుణంలో వీటిని పెంచడం ద్వారా డబ్బు కూడా ఆదా అవుతుంది. ఇంట్లో మిగిలిన ఆహార పదార్థాలు, వ్యర్థాలు, ఎరువుగా తయారు చేస్తున్నాం. - ఎం.పరమానందం

ఖాళీ జాగా ఉంటే చెప్పండి



ఇంటి పరిసర ప్రాంతాలను ఖాళీగా ఉంచితే దోమలు విజృంభించి వ్యాధులు ప్రబలుతాయి. కాలనీలలో ఖాళీ స్థలం ఉంటే జీవీఎంసీ సౌజన్యంతో మొక్కలు నాటి పరిరక్షిస్తాం. పూలు, పండ్ల మొక్కలు పెంచితే ఆరోగ్యం. తిరుమలనగర్ కాలనీలో తయారు చేసే ఎరువులను పంపిణీ చేస్తాం. తాజా కూరగాయలు, ఆకు కూరలతో ఆరోగ్యంగా ఉన్నామన్న సంతృప్తి ఉంటుంది.

-ఎం.శివప్రసాద్, ఉక్కు ఉద్యోగి

ఆన్‌లైన్‌లో విత్తనాల కొనుగోలు



అభిరుచులకు అనుగుణంగా నర్సరీలు, బంధువుల ఇళ్ల నుంచి, వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు చేసేటప్పుడు మొక్కలు కొనుగోలు, సేకరణ చేస్తుంటారు. వాటిని తీసుకువచ్చి ప్లాస్టిక్ డబ్బాలు, కుండీలు, పనికిరాని వాటిలో మట్టి, ఎరువు నింపి సాగు చేస్తున్నాయం. సేంద్రియ విత్తనాలను, పద్ధతులను ఆన్‌లైన్‌లో నేర్చుకుంటూ, ఎలా పెంచి, దిగుబడిని సాధించాలన్న విషయాలను యాప్‌ల ద్వారా తెలుసుకుంటాం.

- డాక్టర్ ఎ.ప్రభుదాస్, ఉక్కు రిటైర్డ్ జీఎం, తిరుమలనగర్

మొక్కలకు చిరునామా...మా డాబా



పదేళ్లగా పలు రకాల మొక్కలను డాబాపై పెంచుతున్నాం. నర్సరీలో కొత్తరకాలు కనిపిస్తే కొనేస్తాం. ప్రస్తుతం 250 కి పైగా మొక్కలను పెంచుతున్నా. వీటిలో క్రోటాన్, పాదులు (క్రీపర్లు), మందారం,బంతి, నిమ్మ, నారింజ, బత్తాయి, కమలా, స్టార్ ఫ్రూట్, అంజూరా, మల్బరీ, డ్రాగన్ ఫ్రూట్, స్వీట్‌లెమన్, సపోటా, దానిమ్మ, తెల్ల నేరేడు, ద్రాక్ష, వాక్కాయ మొక్కలు పెంచుతున్నాను. వీటికి ఇంట్లో తయారుచేసిన సేంద్రియ ఎరువులనే వాడుతున్నాను.

- వై.రామారావు, ఈశ్వరి, హెచ్‌పీసీఎల్ ఉద్యోగి, కాలనీవాసి



రసాయన పరిశ్రమల్లో భద్రతపై వర్క్‌షాప్



సదస్సులో ప్రసంగిస్తున్న జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివశంకరరెడ్డి

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రసాయన పరిశ్రమల్లో భద్రత, అత్యవసర నిర్వహణపై ఫ్యాక్టరీస్ విభాగం, సొసైటీ ఫర్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించాయి. స్టీల్‌ప్లాంటులోని లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ కేంద్రంలో జరిగిన వర్క్‌షాప్‌నకు ఫార్మాజెల్ ఎండీ అనంత్ బర్బడికర్ అధ్యక్షత వహించగా, స్టీల్‌ప్లాంటు వర్క్స్ సీజీఎం రంజన్ మొహంతి ప్రాసెస్ పరిశ్రమల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ కీలకమన్నారు. ఫ్యాక్టరీస్ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివశంకరరెడ్డి 165 రసాయన కంపెనీలున్నాయని రెండింటిలో పెద్ద ప్రమాదాలు జరిగాయని, నివారించే బాధ్యత యాజమాన్యాలదేనని స్పష్టంచేశారు. భద్రత సంస్కృతిపై కె.రామసుబ్బారావు ప్రసంగించారు. లారస్ ప్రతినిధి శ్రీనివాసరావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, రాంబాబు, సుధాకర్ పాల్గొన్నారు.

ఐఎండీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ క్విజ్

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఆధ్వర్యంలో విద్యార్థులకు జాతీయ వాతావరణ ఒలింపియాడ్ పేరిట ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నది. 8,9,10,+1 విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. భారత వాతావరణ శాఖకు 150 సంవత్సరాలు నిండిన సందర్భంగా ఈ పోటీలు నిర్వహించనుంది. ఈనెల 10లోపు ఆన్‌లైన్‌లో రిజిస్టేషన్ చేయించుకోవాలి. 14,15 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయి. 17న ఫలితాలు వెలువడతాయి. వచ్చేనెల 14న జాతీయస్థాయి పోటీలు నిర్వహించి, జనవరి 15న విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

విభిన్న ప్రతిభావంతుల్లో ఏదైనా సాధించగల సత్తా

- కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్



విజేతలకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతి భావంతుల్లో అపారమైన ప్రతిభా పాటవాలున్నాయని, ఏదైనా సాధించగల సత్తా వారి సొంతమని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ అన్నారు. జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వుడా చిల్డ్రన్ ఎరీనాలో మంగళవారం వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నడిచే అన్ని రంగాల్లో విభిన్న ప్రతిభావంతుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని, వారిని విశ్వవిజేతలుగా తీర్చిదిద్దాలని సూచించారు. వారి సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలుచేస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లను భారీగా పెంచిందన్నారు. వినికిడి పరికరాలు, ట్రైసైకిళ్లు అందిస్తోందన్నారు. త్వరలోనే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ప్రభుత్వ శాఖల్లో కోటా కేటాయిస్తామని, పదోన్నతులు కల్పించేలా చర్యలు చేపడతామన్నారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ దివ్యాంగుల చట్టాలు, హక్కులు తెలియజేశారు. హక్కులకు చట్టబద్ధత ఉందని, వాటిని వినియోగించుకోవడం ద్వారా రాజ్యాంగం, ప్రభుత్వాలు కల్పించిన ప్రయోజనాలను పొందాలన్నారు. విద్యా, వైద్య రంగాల్లో లభించే ప్రయోజనాలు, సంరక్షకులు, తల్లిదండ్రులు తెలుసుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన 532 మందికి బహుమతులు, ధ్రువీకరణపత్రాలను అందించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ జె.మాధవి, సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు, డీఈవో ప్రేమ్‌కుమార్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సూపరింటెండెంట్ పద్మావతి, సమగ్ర శిక్ష అధికారులు, ఎన్‌జీవో సంస్థలు, దివ్యాంగులు పాల్గొన్నారు.

సయ్యద్ ముస్తక్ అలీ ట్రోఫీలో ఒడిశా విజయం

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సయ్యద్ ముస్తక్ అలీ ట్రోఫీ టోర్నీలో భాగంగా ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో ఒడిశా 63 పరుగుల తేడాతో అస్సోంపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ఒడిశా నిర్ణీత తొమ్మిది ఓవర్లలో ఏడు వికెట్లకు 120 పరుగులు చేసింది. ఓపెనర్ సాత్విక్ సమల్ కేవలం 26 బంతుల్లో ఏడు బౌండరీలు, ఐదు సిక్సర్లతో అర్ధ సెంచరీ (69) సాధించాడు. గౌరవ్ చౌదరి (13), సందీప్ పట్నాయక్ (14) రాణించారు. అస్సోం బౌలర్లలో రోషన్ అలామ్, అవినవ్ చౌదరి చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన అస్సోం 8.1 ఓవర్లలో కేవలం 57 పరుగులకు కుప్పకూలింది. మిడిల్ ఆర్డర్‌లో సాహిల్ జైన్ (18), నివన్ దేఖ (12) మినహా మిగిలినవారు విఫలమయ్యారు. ఒడిశా బౌలర్లలో రాజేష్ మహంతి, ప్రదీప్ ప్రధాన్, జమల్ మహాపాత్ర, గోవింద పద్దార్ తలో రెండు వికెట్లు పడగొట్టారు.

రుషికొండలో నాగుపాము కలకలం



పట్టుకున్న నాగుపాముతో శ్రీనివాస్

సాగర్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రుషికొండ స్వర్ణభారతినగర్ సమీపంలో మంగళవారం పాము కలకలం రేపింది. స్థానికంగా నివసిస్తున్న వారి ఇంటి పెరట్లో ఎనిమిదిన్నర అడుగుల నాగుపాము కనిపించడంతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే పాములు పట్టే శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చారు. అతడు వచ్చి చాకచక్యంగా పామును పట్టుకున్నాడు. సమీపంలో కొండలు ఉండడం, వర్షాలు కురుస్తుండడంతో పాములు జనావాసాలవైపు వస్తున్నాయి. పాములు ఎక్కడ కనిపించినా చంపకుండా తనకు సమాచారం ఇవ్వాలని శ్రీనివాస్ కోరాడు.

పెందుర్తిలో ప్రభుత్వ స్థలాల కబ్జా



ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణం

పెందుర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలామా కబ్జా చేసేయ్ అంటూ అక్రమార్కులు తెగబడుతున్నారు. తప్పుడు పత్రాలను సృష్టించి, ఆక్రమించిన స్థలంలో యథేచ్ఛగా పక్కా నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు తొలగిస్తున్నా.. మళ్లీ నిర్మాణాలు చేపట్టి సవాల్ విసురుతున్నారు. పెందుర్తి మండలం పాపయ్యరాజుపాలెం సమీప శివగాయత్రినగర్ సర్వే నంబరు 117/2 లో 2.92 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. సుజాతనగర్ బీఆర్టీఎస్ రహదారికి దగ్గరగా ఉండడం, లేఅవుట్‌లు విస్తరించడంతో స్థలం విలువ రూ.కోట్లు పలుకుతోంది. దీంతో అక్రమార్కుల కన్ను పడింది. 2.92 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూమిని కొంతమంది సిండికేట్‌గా ఏర్పడి కొట్టేసేందుకు స్కెచ్ వేశారు. ఈ భూమిని ఆనుకుని ఉన్న జిరాయితీ భూమి సర్వే నంబరు వేసి తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమణలకు తెరతీశారు. పక్కా నిర్మాణాలు చేపట్టారు. ఆక్రమించిన స్థలాలు చేతులు మారి విక్రయాలు జరిగిపోయాయనే ఆరోపణలున్నాయి. అక్రమ నిర్మాణాలను గుర్తించిన రెవెన్యూ అధికారులు వాటిని తొలగించినా, కిందిస్థాయి సిబ్బంది సహకారంతో మళ్లీ నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికే సుమారు 80 సెంట్లలో నిర్మాణాలు చేపట్టారని రెవెన్యూ సిబ్బందే చెబుతున్నారు. తాజాగా మరింత స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుండడంతో తహసీల్దారు కార్యాలయానికి ఫిర్యాదు అందింది.

పరిరక్షణకు చర్యలు

పాపయ్యరాజుపాలెంలో గెడ్డ పోరంబోకు ఆక్రమణపై ఫిర్యాదు అందింది. ఈ మేరకు సర్వే చేయనున్నాం. స్థల పరిరక్షణకు చర్యలు చేపట్టి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేస్తాం.ఆక్రమణదారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటా.

- ఆనంద్‌కుమార్, తహసీల్దార్, పెందుర్తి

మృతుడి కుటుంబానికి రూ.16 లక్షల పరిహారం

- ప్రకటించిన కోరమాండల్ యాజమాన్యం
- ఆందోళన విరమించిన కుటుంబ సభ్యులు



ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబసభ్యులు, కార్మిక నేతలు

మల్కాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్ ఎరువుల కర్మాగారం సంప్‌లో పడి మృతి చెందిన కారు డ్రైవర్ సారిక రమణ కుటుంబానికి యాజమాన్యం రూ.16 లక్షల పరిహారం ప్రకటించింది. సారిక రమణ ఆదివారం రాత్రి సంప్‌లో పడి మృతి చెందినప్పటికీ యాజమాన్యం పరిహారంపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో మంగళవారం ఉదయం మృతుడి భార్య సత్యవతి, ఇద్దరు కుమార్తెలతో కంపెనీ గేటు వద్ద దీక్షకు దిగింది. సీపీఐ నాయకులు కసిరెడ్డిసత్యనారాయణ, రాంబాబు, తదితరులు మద్దతుగా ఆందోళన చేశారు. అనంతరం 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేశ్, కార్మిక సంఘాల నేతలు చేరుకుని యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సాయంత్రం నాలుగు గంటల వరకు ఆందోళన సాగింది. పలు దఫాలుగా చర్చలు జరిపినా ఫలించలేదు. ఆందోళనకారులు రూ.50 లక్షల పరిహారం కోసం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా కంపెనీ మెయిన్‌గేటును తోసుకుని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. హార్బర్ సర్కిల్ ఏసీపీ కాళిదాస్, మల్కాపురం సీఐ విద్యసాగర్, ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో రూ.16 లక్షల పరిహారం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించింది. దీంతో ఆందోళన విరమించారు.

క్రైం... crime news

రెండు ప్రమాదాల్లో పలువురికి స్వల్పగాయాలు





డీమార్ట్ ఎదురుగా ప్రమాదం, కారుషెడ్ కూడలి వద్ద ఇలా...

మధురవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా మంగళవారం ఉదయం వర్షం కురవడంతో జాతీయ రహదారి చిత్తడిగా మారింది. దీంతో మధురవాడ నుంచి కారుషెడ్ కూడలి వరకు జాతీయ రహదారిపై రెండు ప్రమాదాలు జరిగాయి. డీమార్టు ఎదురుగా జాతీయరహదారిపై ఆగి ఉన్న టిప్పర్‌ను ఒక సీఫుడ్ కంటెయినర్ ఢీకొన్న ప్రమాదంలో వాహనాలు దెబ్బతిన్నాయి. మరో ప్రమాదంలో కారుషెడ్ కూడలి సిగ్నల్ పాయింట్ వద్ద ఆయిల్ ట్యాంకర్‌ను మినీ బస్ ఢీకొంది. మినీబస్‌లో నలుగురు ఉద్యోగులు, వాహన డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

40 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు



పట్టుకున్న గంజాయితో ఏసీపీ, సీఐ

కూర్మన్నపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బైక్‌పై తరలిస్తున్న నలభై కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ తెలిపారు. దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందస్తు సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, దువ్వాడ పోలీసులు ఆదివారం రాత్రి మంగళపాలెం వద్ద తనిఖీలు నిర్వహించారన్నారు. ఇంతలో పాడేరు నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్‌కు పల్సర్ బైక్‌పై నర్సీపట్నం పరిధి గురందొరపాలేనికి చెందిన పూడి శ్రీనివాస్, రోలుగుంట మండలం రత్నంపేటకు చెందిన గుమ్మడి ఉపేంద్ర, కశింకోట మండలం గోకివానిపాలేనికి చెందిన సారిపల్లి రామకృష్ణలు వస్తున్నారన్నారు. అనుమానం వచ్చి వీరిని తనిఖీ చేయగా, రెండు గోనె సంచుల్లో రెండు కిలోలు చొప్పున 20 గంజాయి ప్యాకెట్లు పట్టుబడినట్టు చెప్పారు. వీరి వద్ద నుంచి గంజాయి, బైక్, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు చెప్పారు. నిందితుల్లో గుమ్మడి ఉపేంద్ర, సారిపల్లి రామకృష్ణ ఇద్దరూ గంజాయి కేసులో పాత నేరస్థులేనని వివరించారు. వీరి వద్దనుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ. నాలుగు లక్షలు ఉంటుందని వెల్లడించారు. సీఐ మల్లేశ్వరరావు మాట్లాడుతూ గంజాయి తాగినా, విక్రయించినా చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. ఇటువంటి వారి వివరాలు తెలిసినవారు తమకు సమాచారం అందిస్తే గోప్యంగా ఉంచడంతో పాటు బహుమతులు అందజేస్తామన్నారు.

రైల్వేస్టేషన్‌లో ఐదుకిలోల పట్టివేత

విశాఖపట్నం: రైల్లో గంజాయి తరలించేందుకు యత్నిస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని రూ.25 వేలు విలువ చేసే ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆర్పీఎఫ్ ఎస్ఐ పీఆర్ బిసోయ్, జీఆర్పీ ఎస్ఐ ఎస్కేఅబ్దుల్ తనిఖీలు చేస్తుండగా ఒడిశాలోని మల్కనగిరికి చెందిన జహన్‌అంగులియా గంజాయి సంచులను మరో వ్యక్తికి అందజేసే ప్రయత్నంలో పట్టుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచామన్నారు.

900 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

కంచరపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 900 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకుని, నిందితుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బిర్లాజంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా బాపి అశోక్ తన తొట్టి ఆటోలో 900 కిలోల పీడీఎఫ్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. బియ్యం ఎవరవి, ఎక్కడికి తరలిస్తున్నారనే దానిపై ఆరా తీస్తున్నారు. ఎస్.ఐ.రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులవేనం వ్యూపాయింట్ మూసివేత

చింతపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి సమీపంలో ఉన్న చెరువులవేనం వ్యూపాయింట్‌ను మంగళవారం సాయంత్రం నుంచి మూసివేశారు. వర్షాల వల్ల చెరువులవేనంకి వెళ్లే మార్గంలో కొండచరియలు విరిగిపడుతుండడంతో తాత్కాలికంగా మూసివేసినట్టు స్థానిక తహసీల్దార్ రవి కుమార్ తెలిపారు. ప్రస్తుతం శీతాకాలం కావడంతో లంబసింగికి వచ్చే వేల సంఖ్యలో పర్యాటకులు ఉదయం వేళల్లో చెరువులవేనం వ్యూపాయింట్‌ను సందర్శించి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తారు. ప్రస్తుతం ఫెంగల్ తుఫాన్ ప్రభావం వల్ల వర్షాలు కురుస్తున్నప్పటికీ చెరువులవేనం వ్యూపాయింట్‌కి పర్యాటకుల తాకిడి తగ్గలేదు. అయితే చెరువులవేనంకి వెళ్లే ఘాట్ మార్గం వర్షానికి తడిసిపోయి ఆకస్మికంగా రహదారిపై కొండచరియలు విరిగి పడుతున్నాయి. దీంతో పర్యాటకులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్నదని ముందస్తు చర్యల్లో భాగంగా రెవెన్యూ అధికారులు సందర్శనలను రద్దు చేశారు. వాతావరణం అనుకూలించి, రెవెన్యూ అధికారులు ప్రకటించే వరకు పర్యాటకులు వ్యూపాయింట్ వద్దకు వెళ్లరాదని తహసీల్దార్ తెలిపారు.